మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 1-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 93 Issue: 93

Published from Jagitial
www.evarthalu.com

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు ఆశ్వయుజ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:09 సూర్యాస్తమయం - సా. 6:04 తిథిః పంచమి మ. 12:03 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం అనురాధ రా. 1:00ం వరకు తరువాత జ్యేష్ఠ యోగం ప్రీతి రా. 11:44 వరకు కరణం భాలవ మ. 12:03 వరకు కౌలవ రా. 1:16ం వరకు వర్జ్యం ఉ. 7:44 నుండి ఉ. 8:32 వరకు దుర్ముహూర్తం ఉ. 7:44 నుండి ఉ. 8:32 వరకు రాహుకాలం ఉ. 9:08 నుండి ఉ. 10:37 వరకు యమగండం మ. 1:36 నుండి మ. 3:05 వరకు గుళికాకాలం ఉ. 6:09 నుండి ఉ. 7:38 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:33 నుండి తె. 5:21 వరకు అమృత ఘడియలు మ. 1:26 నుండి మ. 3:14 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:43 నుండి మ. 12:30 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



## ఇండోనేషియాలో కుప్పకూలిన మదర్సా

**ముగ్గురు మృతి.. శిథిలాల కింద 38 మంది**

జకార్తా: ఇండోనేషియాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. విద్యార్థులు ప్రార్థనలు చేస్తుండగా పాఠశాల భవనం ఒక్కసారిగా కుప్పకూలడంతో ముగ్గురు మృతి చెందగా, వందల మంది గాయపడ్డారు. పదుల సంఖ్యలో విద్యార్థులను కాపాడగా, మరో 38 మంది విద్యార్థులు శిథిలాల కింద -2 వ పేజీలో...



## చెన్నై పవర్ ప్లాంట్‌లో ప్రమాదం

**9 మంది కార్మికులు మృతి**

చెన్నై: తమిళనాడులో షాకింగ్ ఘటన జరిగింది. చెన్నైలోని ఎన్నోర్ పవర్ ప్లాంట్ లో నిర్మాణంలో ఉన్న పరంజా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో 9 మంది కార్మికులు మృతి చెందారు. ఘటన జరిగిన వెంటనే వాళ్లను స్థానిక స్టాన్ లీ ఆస్పత్రికి తరువాయి 2 వ పేజీలో...



## పాక్‌లోని క్వెట్టాలో భారీ పేలుడు..

**13 మంది దుర్మరణం**

క్వెట్టా: పాకిస్థాన్‌లోని క్వెట్టా నగరంలో భారీ పేలుడు సంభవించింది. బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో పారామిలిటరీ దళాలపై జరిగిన ఈ బాంబు దాడిలో కనీసం 13 మంది మృతి చెందగా, 32 మందికి పైగా గాయపడ్డారు. క్వెట్టాలోని ఫ్రాంటియర్ కోర్ కేంద్ర -2 వ పేజీలో...



### నేటి అవతారం: మహిషాసురమర్దిని దేవి

శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం, విజయవాడ

# ఆడబిడ్డలపై అరాచకాలు

**2023లో 23,678 కేసులు నమోదు**

## రాష్ట్రంలో మహిళలపై పెరిగిన నేరాలు

తెలంగాణలో మహిళలపై నేరాలు పెరిగినట్లు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో తెలిపింది. 2023లో మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు ఏకంగా 23,678 నమోదైనట్లు తెలిపింది. ఈ సంఖ్య 2022లో 22,066, 2021లో 20,865గా ఉన్నట్లు వెల్లడించింది. ఇక ఐపీసీ సెక్షన్ కింద 2023లో 1,56,737 కేసులు నమోదు కాగా, 2022లో 1,51,849 కేసులు నమోదైనట్లు వివరించింది. హైదరాబాద్‌లోనూ ఐపీసీ కేసులు భారీగా పెరిగాయని స్పష్టం చేసింది.



**హైదరాబాద్‌లో పెరిగిన ఐపీసీ కేసులు**

**భారీగా సైబర్ మూకల దాడులు**

**ఎన్‌సీఆర్‌బీ తాజా నివేదికలో వెల్లడి**

హైదరాబాద్/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): దేశంలో ఆదివాసీ తెగలను, అభంశుభం తెలియని చిన్నారులను, మహిళలను లక్ష్యంగా చేసుకొని దాడులు పెరిగిపోతున్నాయి. ఆర్థిక నేరాలకు తెగిస్తున్న సైబర్ మూకల దాడులు కూడా హెచ్చరిల్లుతున్నాయి. గత గణాంకాలతో పోలిస్తే ఈ తరహా దాడులు క్రమేపి పెరుగుతూనేవుండటం ఆందోళన కలిగిస్తున్నాయి. 2023 సంవత్సరానికి సంబంధించి నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌బీఆర్బీ) విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేసింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 2023లో షెడ్యూలు తెగలు (ఎస్టీలు) పై దాడులు ఏకంగా 28.8 శాతం పెరిగాయి. 2022లో ఎస్టీలపై నేరాలకు సంబంధించి 10,064 కేసులు నమోదు కాగా, 2023లో ఈ కేసుల సంఖ్య 12,960కు పెరిగింది. అలాగే, ఈ కేటగిరీలో మొత్తం నేరాల రేటు కూడా 2022తో పోలిస్తే 9.6 శాతం -2 వ పేజీలో...



## రేవంత్‌ను కలిసి ఆసియా కప్ హీరో


**సీఎంకు తిలక్ వర్మ బ్యాట్ బహూకరణ**

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): ఆసియా కప్ ఫైనల్‌లో రాణించిన తెలుగు యువ క్రికెటర్ తిలక్ వర్మ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తిలక్ వర్మను రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించి, సత్కరించారు. ఈ సందర్భంగా తిలక్ వర్మ... సీఎం రేవంత్ రెడ్డికి క్రికెట్ బ్యాట్‌ను బహుమతిగా అందజేశారు. క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి తిలక్ వర్మ ముఖ్యమంత్రిని కలిశారు. ఆసియా కప్-2025 ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై భారత్ విజయంలో తిలక్ వర్మ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే.



## రేపు మద్యం, మాంసం దుకాణాలు బంద్

హైదరాబాద్/వైజాగ్, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): తెలంగాణలో దసరా పండుగ అంటేనే చుక్క, ముక్క అన్నట్లు సాగుతుంది. కానీ ఈ సారి పండుగకు భారీ షాక్ తగిలింది. ముందుగా ప్లాన్ చేసుకుని మద్యం, మటన్, చికెన్ ఆర్డర్ పెట్టుకుంటేనే దొరికేలా ఉంది. ఎందుకంటే దసరా రోజు ఈ షాపులు బంద్ కానున్నాయి. అక్టోబర్ 2న గాంధీ జయంతి. అంటే -2 వ పేజీలో...



## యువతిపై పోలీసుల లైంగికదాడి

**తమిళనాడులోని అరుణాచలంలో ఘోరం**

సమాజంలో రక్షణ కల్పించాల్సిన పోలీసులే రాక్షసులుగా మారిన దారుణ ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 18 ఏళ్ల యువతిపై ఇద్దరు తమిళనాడు పోలీసులు అత్యాచారానికి పాల్పడిన అమానవీయ సంఘటన తిరువణ్ణామలై (అరుణాచలం)లో వెలుగుచూసింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

అరుణాచలం, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన లక్ష్మి (18) అనే యువతి టమాటాలు రవాణా చేస్తున్న ఒక గూడ్స్ వాహనంలో ప్రయాణిస్తోంది. సోమవారం రాత్రి ఎంథాల్ బైపాస్ వద్ద రౌండ్స్‌లో ఉన్న సుందర్, సురేశ్ రాజ్ అనే ఇద్దరు కానిస్టేబుళ్లు ఆ వాహనాన్ని తనిఖీ కోసం ఆపారు. వాహనంలో ఉన్న యువతి పై అనుమానం ఉందంటూ, విచారణ చేయాలని ఆమెను బలవంతంగా కిందకు దించారు. అనంతరం, ఆమెను పక్కనే ఉన్న పొలాల్లోకి లాక్కెళ్లి ఇద్దరు కానిస్టేబుళ్లు అత్యాచారానికి ఒడిగట్టారు. యువతి కేకలు వేయడంతో సమీపంలో ఉన్న స్థానికులు గమనించి వెంటనే అక్కడికి చేరుకున్నారు. వారిని చూసి కానిస్టేబుళ్లు పరారయ్యారు. స్థానికులు బాధితురాలిని రక్షించి, అంబులెన్స్ తరువాయి 2 వ పేజీలో...




## పీవోకేలో తిరుగుబాటు

**ప్రజల చేతుల్లో పోలీసుల బందీ.. కట్టలు తెంచుకున్న ప్రజాగ్రహం**

**ప్రధాన నగరాల్లో భారీగా నిరసన ర్యాలీలు**

ముజఫరాబాద్: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో నిరసనలు మరింత హింసాత్మకంగా మారాయి. హక్కుల సాధన కోసం చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తతలకు దారితీయడంతో, పోలీసులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. దీంతో ప్రజలు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. నిరసనలు అణచివేయడానికి వచ్చిన పోలీసులు, ఆర్మీ సిబ్బందిని పౌరులు బంధించినట్లు తరువాయి 2 వ పేజీలో...



## దీపిక నం.1

పదేళ్లలో అత్యధిక మంది సెర్చ్ చేసిన నటీనటుల్లో దీపిక పడుకోన్ టాప్ ప్లేస్‌లో నిలిచిందని ఐఎండీబీ తెలిపింది. జనవరి 2014 నుంచి ఏప్రిల్ 2024 మధ్య వీక్లీ ర్యాంకింగ్స్ ఆధారంగా జాబితాను రూపొందించనట్లు వెల్లడించింది. దీపిక తర్వాత షారుక్, ఐశ్వర్య, ఆలియా, ఇర్ఫాన్ ఖాన్ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. టాప్-10లో దక్షిణాది నటులెవ్వరూ చోటుసంపాదించుకోలేదు. సమంత 13, ప్రభాస్ 29, ధనుష్ 30, రాంచరణ్ 31, అల్లు అర్జున్ 47, జూనియర్ ఎ ఎన్టీఆర్ 67వ స్థానాల్లో ఉన్నారు.




| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.11,744 |
| వెండి (గ్రాము): | రూ.161 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,541 |

### జూబ్లీహిల్స్‌లో 3.99 లక్షల ఓటర్లు

తుది ఓటర్ల జాబితా ప్రచురించిన ఈసీ


### గ్రూప్ 3 ప్రొవిజినల్ జాబితా విడుదల

ప్రారంభమైన వెబ్ ఆప్షన్స్ ప్రక్రియ

### ట్రంప్ మరో పిడుగు

కలప, ఫర్నిచర్‌పై 25 శాతం సుంకం

### విశ్వవాణి



**చిన్న స్కేలు సైజులో షార్క్**

చిన్న స్కేలు పరిమాణం అంటే.. 14 సెంటీమీటర్ల సైజు ఉన్న షార్క్‌ను గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో గుర్తించారు. ఈ షార్క్ రాత్రి సమయాల్లో వెలుగులు చిమ్ముతూ ఉంటుందట.



## హమాస్‌కు మూడ్రోజులే టైం

**ఇజ్రాయెల్ ఒప్పందానికి అంగీకరించాలి**

**నిరాకరిస్తే ఇజ్రాయెల్‌కు స్వేచ్ఛ: ట్రంప్**

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. తాను నోబెల్ శాంతి బహుమతిని కోరుకోవడం లేదని, గాజా వివాదానికి శాశ్వత శాంతిని తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్నానని ట్రంప్ అన్నారు. గాజా వివాదం కోసం తన కాల్పుల విరమణ ప్రతిపాదన దాదాపుగా ఖరారు అయిందని తరువాయి 2 వ పేజీలో...

# స్టాలిన్.. నన్నేమైనా చేస్కో!

**మా వాళ్లను వేధించవద్దు.. టీవీకే చీఫ్ విజయ్ భావోద్వేగ వీడియో**

**త్వరలోనే బాధితులను స్వయంగా కలుస్తానని వెల్లడి.. నిజానిజాలు త్వరలోనే బయటపడతాయని ధీమా**



తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, ప్రముఖ నటుడు విజయ్ కరూర్ లో జరిగిన తొక్కిసలాట ఘటనపై తీవ్రంగా స్పందించారు. ఈ సంఘటన తనను ఎంతగానో కలచివేసిందని పేర్కొన్నారు. ఈ ఘటనతో తన గుండె బద్దలైందని, మాటలు రావడంలేదని అన్నారు. తాను ఏ తప్పు చేయలేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఒక భావోద్వేగ వీడియో విడుదల చేశారు.

చెన్నై: కరూర్ ఘటనపై ఆయన మాట్లాడుతూ, "నా జీవితంలో ఇలాంటి పరిస్థితిని ఎప్పుడూ ఎదుర్కోలేదు. ఈ దురదృష్టకర ఘటన జరిగి ఉండాల్సింది కాదు. నేను కూడా మనిషినే... అంతమంది చనిపోయారని తెలిస్తే అక్కడ్నించి వెళ్లిపోతానా?... ర్యాలీ కోసం అన్ని జాగ్రత్తలు తీసుకున్నా గానీ ఊహించని ఘటన జరిగింది" అని విజయ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాదు, విమర్శల పట్ల విచారం వ్యక్తం చేశారు. "నన్ను టార్గెట్ చేసుకోండి కానీ, మా నేతలను వేధించవద్దు... సీఎం స్టాలిన్ ప్రతీకారం తరువాయి 2 వ పేజీలో...

# ఆడబిడ్డలపై అరాచకాలు

**మొదటి పేజీ తరువాయి**

పెరిగింది. అంటే 28.8శాతం పెరిగాయి. అలాగే 2023లో సైబర్ క్రైమ్‌లు కూడా 2022తో పోలిస్తే 31.2 శాతం పెరిగాయి. 2022లో 65,893 సైబర్ క్రైమ్ కేసులు నమోదు కాగా, 2023లో 86,420 కేసులు నమోదయ్యాయి. అంటే 31.2శాతం పెరిగాయి. 2023లో నమోదైన సైబర్ నేరాల్లో ఎక్కువగా అంటే 59,526 కేసులు (68.9 శాతం) పౌరులను మోసం చేయడమే లక్ష్యంగా జరిగాయి. తరువాత స్థానంలో లైగింగ వేధింపుల కేసులు వున్నాయి. అవి 4.9 శాతం (4,199)గా వుండగా దోపిడీ కేసులు గా, 3.8 శాతం (3,326)గా నమోదయ్యాయి. 2022తో పోలిస్తే 2023లో హత్య కేసుల్లో స్వల్పంగా 2.8 శాతం తగ్గుదల కనిపించింది. 2022లో దేశంలో 28,522 హత్య కేసులు నమోదు కాగా, 2023లో 27,721 కేసులు నమోదయ్యాయి. వీటిలో వివాదాలకు సంబంధించిన కేసులు అత్యధికంగా 9,209 ఉన్నాయి. తరువాత స్థానంలో ప్రతీకారం లేదా శత్రుత్వంతో హతమార్చిన కేసులు 3,458 గా ఉన్నాయి. 2023లో దేశవ్యాప్తంగా 62,41,569 కేసులు నమోదు కాగా, వీటిలో 37,63,102 కేసులు ఇండియన్ పీనల్ కోడ్ కింద మిగిలిన 24,78,467 కేసులు ప్రత్యేక, స్థానిక చట్టాల కింద నమోదయ్యాయి. 2022తో పోలిస్తే 2023లో కేసుల నమోదులో 7.2 శాతం (4,16,623) పెరుగుదల కనిపించింది. అలాగే, ప్రతీ లక్ష జనాభాకు నమోదైన నేరాల రేటును పరిశీలిస్తే అది కూడా పెరిగింది. 2022లో ప్రతీ లక్ష జనాభాకు 422.2 కేసులు నమోదు కాగా, 2023లో ఇది 448.3కు పెరిగింది.

మహిళలపై దాడులు (ప్రతి లక్షకు)
క్రైం రేటు: తెలంగాణ - 189.6
జాతీయ సగటు - 66.2
(జాతీయ సగటు కన్నా తెలంగాణ సగటు 3 రెట్లు అధికం)





# పాక్‌లోని క్వెట్టాలో భారీ పేలుడు..

**మొదటి పేజీ తరువాయి**

కార్యాలయం సమీపంలో రద్దీగా ఉండే ప్రాంతం లో ఈ పేలుడు సంభవించింది. పేలుడు జరిగిన వెంటనే కాల్పుల మోత కూడా వినిపించిం ది. ఈ పేలుడు ధాటికి చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఇళ్లు, భవనాల కిటికీల అద్దాలు పగిలిపోయాయి. బలూచి స్థాన్ ఆరోగ్య మంత్రి బఖ్త్ మహమ్మద్ కాకర్ ఈ దాడిని ధృవీకరించారు. ఈ ఘటనలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి, ఆ ప్రాంతంలో అత్యవసర పరిస్థితిని విధించారు. దాడు లకు పాల్పడిన వారిని గుర్తించేందుకు భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ పేలుడు కు ఇప్పటి వరకు ఏ సంస్థ బాధ్యత వహిస్తూ ప్రకట న చేయలేదు. అయితే, బలూచ్ తిరుగుబాటు గ్రూపులు తరుచూ భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసు కుని దాడులు చేస్తుంటాయి. ఈ దాడిని బలూచిస్థాన్ ముఖ్యమంత్రి మీర్ సర్ఫరాజ్ ఖండించారు. ఇది ఉగ్రదాడి అని ఆయన అభివర్ణించారు. ఉగ్రవాదులు పిరికి చర్యల ద్వారా దేశం యొక్క సంకల్పాన్ని బలహీనపరచలేరని ఆయన అన్నారు. ప్రజలు, భద్రతా దళాల త్యాగాలు వృధా కానివ్వబోమని ఆయన స్పష్టం చేశారు.

## ఇండోనేషియాలో కుప్పకూలిన మదర్సా

**మొదటి పేజీ తరువాయి**

చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ హృదయ విదారక ఘటన తూర్పు జావాలోని సిడోర్జో ప్రాంతంలో ఉన్న అల్ ఖోజినీ ఇస్లామిక్ బోర్డింగ్ స్కూల్‌లో జరిగింది. మధ్యాహ్నం ప్రార్థనల కోసం విద్యార్థులు భవనంలోని ప్రార్థనా మందిరంలో సమావేశమయ్యారు. అదే సమయంలో భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు, పోలీసులు, సైనికులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారికి ఆక్సిజన్, నీరు అందిస్తూ వారిని ప్రాణాలతో కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, శిథిలాలు అస్థిరంగా ఉండటంతో భారీ యంత్రాలను వాడటానికి అధికారులు వెనుకాడుతున్నారు. శిథిలాల కింద చిక్కుకున్నవారంతా వారంతా 12 నుంచి 17 ఏళ్లలోపు వారేనని పాఠశాల యాజమాన్యం తెలిపింది. తమ పిల్లల క్షేమ సమాచారం కోసం తల్లిదండ్రులు, బంధువులు ఆసుపత్రులు, ప్రమాద స్థలం వద్ద ఆందోళనతో ఎదురుచూస్తున్నారు. శిథిలాల నుంచి తమ పిల్లలను బయటకు తీస్తుండగా చూసి వారు కన్నీరుమున్నీరవుతున్న దృశ్యాలు అక్కడి వారిని కలిచివేస్తున్నాయి. అక్రమ నిర్మాణం కారణంగానే భవనం బరువును మోయలేక కూలిపోయిందని ప్రావిన్షియల్ పోలీస్ ప్రతినిధి జూల్స్ అబ్రహం అబస్త్ తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సహాయక సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## హమాస్‌కు మూడ్రోజులే టైం

**మొదటి పేజీ తరువాయి**

పేర్కొన్నారు. "మధ్యప్రాచ్యం మొత్తం సంతకం చేయాలని మేం కోరుతున్నాం. ఇది అసాధ్యమైన పని, కానీ అది పూర్తయింది. ఇప్పుడు మనం హమాస్ కోసం వేచి ఉండాలి. వారు సంతకం చేయకపోతే, పరిణామాలు చాలా భయంకరంగా ఉంటాయి" అని ట్రంప్ తెలిపారు. హమాస్‌కు మూడు నుంచి నాలుగు రోజుల సమయం ఇచ్చామని స్పష్టం చేశారు. ఒకవేళ వారు నిరాకరిస్తే, ఇజ్రాయెల్‌కు "ఏది కావాలంటే అది చేసుకునేందుకు" స్వేచ్ఛ ఇస్తానన్నారు. "హమాస్ ఈ ఒప్పందాన్ని అంగీకరించకపోతే, వారు నరకయాతన అనుభవించాల్సి ఉంటుంది. మేము 25,000 మందికి పైగా హమాస్ ఉగ్రవాదులను చంపి, వారి నాయకత్వాన్ని మూడుసార్లు నిర్మూలించాం. ఇప్పుడు, వారు శాంతిని కోరుకుంటే మంచిది.. లేకుంటే పరిస్థితులు మరింత దిగజారిపోతాయి" అని ట్రంప్ హెచ్చరించారు. రష్యా గురించి ట్రంప్ మాట్లాడుతూ.. ఇటీవల మాస్కో అమెరికాను బెదిరించిందని.. ప్రతిస్పందనగా రష్యా తీరంలో రెండు అణు జలాంతర్గాములు మోహరించినట్లు తెలిపారు. అణ్వాయుధాలను ఉపయోగించాల్సి వస్తే, తమ దగ్గర ఇతర దేశాల కన్నా అధికంగా ఉన్నాయని తెలిపారు.

## స్టాలిన్.. నన్నేమైనా చేస్కో!

**మొదటి పేజీ తరువాయి**

తీర్చుకోవాలనుకుంటే నన్ను ఏమైనా చేసుకోండి" అంటూ భావోద్వేగంతో కూడిన వ్యాఖ్యలు చేశారు. తాను భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తానని, త్వరలోనే తాను స్వయంగా బాధితుల ను కలిసి పరామర్శిస్తానని హామీ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన అసలు నిజాలు త్వరలోనే వెలుగులోకి వస్తాయని, న్యాయం జరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. త్వరలో తిరుపతి వెళ్లి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటానని విజయ్ తెలిపారు.

## యువతిపై పోలీసుల లైంగికదాడి

**మొదటి పేజీ తరువాయి**

ద్వారా తిరువణ్ణామలై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. ఈ దారుణానికి పాల్పడిన ఇద్దరు కానిస్టేబుళ్లపై కేసు నమోదు చేసి, వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులే ఇలాంటి పైశాచిక చర్యలకు పాల్పడటంపై సర్వత్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.



## పీవోకేలో తిరుగుబాటు

**మొదటి పేజీ తరువాయి**

తెలిసింది. పోలీసులను లాక్కెళ్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్థానిక మీడియా కథనాల ప్రకారం, పోలీసుల చర్యల వల్ల ముస్తాక్ అహ్మద్, నదీమ్ అబ్బాసి సహా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ చేసిన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడమే ఈ హింసకు కారణమని నిరసనకారులు ఆరోపిస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమవ్వడంతో ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ పరిణామాలపై యాక్షన్ కమిటీ అధ్యక్షుడు షౌకత్ నవాజ్ మీర్ ముజఫరాబాద్‌లో మాట్లాడుతూ తీవ్ర ఆరోపణలు చేశారు. "ప్రభుత్వ యంత్రాంగమే తమ ప్రజలపై దాడికి దిగింది. ప్రజలను చంపేందుకు ప్రభుత్వ పెద్దలు, అధికారులు కుట్ర పన్నారు" అని ఆయన విమర్శించారు. మీడియా కూడా తప్పుడు ప్రచారానికి పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. మరోవైపు, మిర్‌పూర్, కోట్లి, ముజఫరాబాద్ నగరాల్లో వేలాదిగా ప్రజలు రోడ్లపైకి వచ్చి భారీ ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. అన్వర్ ప్రభుత్వ పాలన అసమర్థంగా ఉందని, ప్రజలను అణచివేస్తోందని పలు స్థానిక సంఘాలు ఆన్‌లైన్‌లో విమర్శలు గుప్పిస్తున్నాయి.

## చెన్నై పవర్ ప్లాంట్‌లో ప్రమాదం

**మొదటి పేజీ తరువాయి**

తరలించారు. అయితే అప్పటికే వాళ్లు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అయితే ఈ ప్రమాదంలో మరికొంత మంది కార్మికులకు గాయాలైనట్లు సమాచారం. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తమిళనాడును వరుస విషాదాలు వెంటాడుతున్నాయి. ఇటీవల టీవీకే అధ్యక్షుడు విజయ్ కరూర్ లో నిర్వహించిన ర్యాలీలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల్లో చిన్నపిల్లలు, మహిళలు కూడా ఉన్నారు. అయితే తాజాగా తమిళనాడులో మరో విషాద ఘటన జరిగింది. చెన్నైలోని ఎన్నోర్ థర్మల్ పవర్ ప్లాంట్ లో నిర్మాణంలో ఉన్న పరంజా కుప్పకూలింది. ఈ ఘటనలో 9 మంది వలస కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. మరికొంతమంది కార్మికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక స్టాన్ లీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే వారి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు సమాచారం. ఎన్నోర్ థర్మల్ పవర్ ప్లాంట్ లో గతకొంత కాలంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ ప్లాంట్ లో వందలకొద్దీ నార్త్ ఇండియన్ కార్మికులు ఏళ్లుగా పనులు చేస్తున్నారు.

## రేపు మద్యం, మాంసం దుకాణాలు బంద్

**మొదటి పేజీ తరువాయి**

ఆ రోజు ఆ రోజు మాంసం, మద్యం దుకాణాలు మూసివేసే ఉంటాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ఆదేశాలు కూడా జారీ చేస్తున్నాయి. తాజాగా, గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న జీహెచ్ఎంసీ పరిధిలోని వధశాలలు, రిటైల్ మాంసం, బీఫ్ దుకాణాలను మూసివేయాలని జీహెచ్ఎంసీ ఆదేశాలు జారీ చేసింది. జీహెచ్ఎంసీ చట్టం%-%1955లోని 533(బీ) విభాగం ప్రకారం ఇటీవల జరిగిన సమావేశంలో స్టాండింగ్ కమిటీ ఈ నిర్ణయాన్ని ఆమోదించింది. సోమవారం అధికారిక ఆదేశాలు జారీ చేయడంతో మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షణలో చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు సూచించారు. ఎవరైనా మాంసం లేదా మద్యం విక్రయాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటు.. వైజాగ్‌లో జీవీఎంసీ కూడా అవే ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు దసరా రోజున మద్యం, మాంసం విక్రయాలను బంద్ చేయనున్నాయి

## విద్య, ఉద్యోగవాణి

యూపీఎస్సీ-ఇంజినీరింగ్
### సర్వీసెస్ ఎగ్జామ్

మొత్తం ఖాళీలు: 474
అర్హత: బీఈ, బీటెక్, ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి
వయోపరిమితి: 01-01-2026 నాటికి 21-30 ఏళ్ల మధ్య ఉండాలి
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్
ఎంపిక విధానం: ప్రిలిమినరీ, మెయిన్స్, పర్సనాలిటీ, మెడికల్ ఎగ్జామినేషన్
దరఖాస్తు రుసుం: మహిళా, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు ఫీజు లేదు. ఇతరులకు రూ.200
దరఖాస్తు చివరి తేదీ: అక్టోబర్ 10, 2025

## రాశి ఫలాలు
01.10.2025

మేషం: సమాజంలో ప్రముఖులతో చర్చలకు అనుకూలమైన రోజు ఇది. వృత్తి వ్యాపారాలలో తీసుకున్న నిర్ణయాలు అనుకూలంగా సాగుతాయి. ఆలోచనలు అనుకూలంగా సాగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. భూ సంభందిత క్రయ విక్రయాలు లాభిస్తాయి. ఉద్యోగమున సమస్యలు అధిగమిస్తారు.

వృషభం: చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు తప్పవు. ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ అవసరం. ఆకస్మిక ధనవ్యయ సూచనలు ఉన్నవి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి, ఉద్యోగాలు అంతగా రాణించవు. వ్యాపారమున కీలక సమయంలో నిర్ణయాలు తీకోలేరు.

మిధునం: ఆర్ధిక ఇబ్బందులు బాధిస్తాయి. దీర్ఘ కాలిక ఋణ ఒత్తిడి అధికమవుతుంది. కుటుంబ బాధ్యతలు మరింత చికాకు పరుస్తాయి. బంధుమిత్రులతో చిన్నపాటి వివాదాలు తప్పవు. నిరుద్యోగులకు నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఉద్యోగమున కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

కర్కాటకం: బంధు మిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. ముఖ్యమైన పనులలో అవరోధాలు కలిగిన అధిగమించి ముందుకు సాగుతారు. ఆకస్మిక ధన ప్రాప్తి కలుగుతుంది. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు లాభిస్తాయి. కుటుంబ సభ్యుల ఆదరణ పెరుగుతుంది. ఉద్యోగము న ఆలోచించి ముందుకు సాగడం మంచిది.

సింహం: కీలక సమయంలో బంధు మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో పరిస్థితులు అనుకూలంగా మారుతాయి. చిన్న నాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలు విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగాలలో అనుకూలత పెరుగుతుంది.

కన్య: దీర్ఘ కాలిక రుణబాధలు తొలగుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. కుటుంబమున అవసరానికి కీలక నిర్ణయాలు తీసుకుంటారు. చేపట్టిన వ్యవహారాలు అనుకూలంగా సాగుతాయి. వ్యాపారమునకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహం కలుగుతుంది.

తుల: ఋణ దాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. మానసిక సమస్యలు చికాకు పరుస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా వేయడం మంచిది. వ్యాపారా, ఉద్యోగాలు ఊహించని సమస్యలు ఎదురవుతాయి.

వృశ్చికం: చేపట్టిన పనులు శ్రమాధిక్యతతో కానీ పూర్తి కావు. ఆత్మ విశ్వాసంతో వివాదాల నుంచి బయటపడతారు. దూరప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి./ వ్యాపారాలలో ఇబ్బందులు ఎదురైనా అధిగమించి లాభాలు అందుకుంటారు. ఉద్యోగమున ధైర్యముగా నిర్ణయాలు చేస్తారు. ఆదాయం బాగుంటుంది.

ధనస్సు: ఇతరుల వ్యవహారాలలో తలదూర్చడం మంచిది కాదు. మీ ఆలోచనలు కుటుంబ సభ్యులకు నచ్చే విధంగా ఉండవు. చేపట్టిన పనులు మధ్యలో నిలిపివేస్తారు. ఆర్ధిక పరంగా ఇబ్బందులు మరింత బాధిస్తాయి. వృత్తి, వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటాయి.

మకరం: చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. దాయాదుల తో భూ సంభందిత వివాదాలు కొలిక్కి వస్తాయి. నుండి శుభవార్తలు అందుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. ఉద్యోగమున వివాదాలు పరిష్కరించుకుంటారు. వృత్తి వ్యాపారాలు తన ప్రయత్నాలు ఫలిస్తాయి.

కుంభం: చేపట్టిన పనులు నత్త నడక సాగుతాయి. కత్తులు తగినంత ఆదాయం లభించదు. వృధా ఖర్చులు విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాపారమున భాగస్తులతో చిన్నపాటి వివాదాలతో తప్పవు. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఉద్యోగమున అధికారులతో వివాదాలు కలిగే సూచనలున్నవి.

మీనం: అనారోగ్య ఉపశమనం లభిస్తుంది. కొన్ని వ్యవహారాలలో ఇతరుల సహయ సహకారాలు అందుతాయి. ధనదాయం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు అనుకూల ఫలితాలను ఇస్తాయి. సంతాన విద్య విషయాలు పట్ల సంతృప్తికరంగా సాగుతాయి.

# తాగుబోతుల రాష్ట్రం చేస్తున్నారు!





**రేవంత్ పాలనపై హరీశ్ రావు ధ్వజం**

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి హామీలను నెరవేర్చకపోవడంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పార్టీ తీవ్ర స్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎంతమేర బాకీ పడిందో తెలియజేసేందుకు ప్రతి ఇంటికి 'కాంగ్రెస్ బాకీ కార్డును' పంచుతామని అన్నారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో నేడు కాంగ్రెస్ బాకీ కార్డును హరీష్ విడుదల చేశారు. "ప్రతి ఇంటికి, ప్రతి రైతుకు, ప్రతి మహిళకు కాంగ్రెస్ పార్టీ ఎంత బాకీ పడిందో ప్రజలకు వివరించాలి. రైతుబంధు కింద ప్రతి రైతుకు రూ.75 వేలు, మహాలక్ష్మి కింద ప్రతి మహిళకు రూ.44 వేలు కాంగ్రెస్ బాకీ పడింది. తక్షణమే ఈ డబ్బులు ఇచ్చి ఓట్లు అడగాలి," అని హరీశ్ రావు డిమాండ్ చేశారు. యూరియా బస్తాలు ఇచ్చే తెలివి లేదు కానీ, ఊరూరా బెల్టు షాపులు, మైక్రోబ్రూవరీలు పెట్టి తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. అబద్ధపు హామీలతో ప్రజలను నమ్మించి గొంతు కోసిందని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ధ్వజమెత్తారు. బాకీ కార్డు లోకల్ బాడీ ఎన్నికల్లో బ్రహ్మాస్త్రం అవుతుందని, కాంగ్రెస్ పాలిట ఉరితాడు అవుతుందని హరీశ్ రావు పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో కాంగ్రెస్ మోసాలపై చర్చ జరగాలని ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు:**

- హామీల బంద్, పథకాల బందు: కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన కేసీఆర్ కిట్టు, న్యూట్రిషన్ కిట్టు, రైతుబంధు, కళ్యాణ లక్ష్మి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ చేసిందని ఆరోపించారు. చివరికి కేసీఆర్ ఇచ్చిన ట్రాక్టర్లలో డీజిల్ కూడా పోయలేని పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు.
- రైతుబంధు మోసం: రైతుబంధు రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి, పోయిన వానకాలం మొత్తానికి ఎగ్గొట్టారని, యాసంగిలో కూడా మూడెకరాల వారికే ఇచ్చారని విమర్శించారు. ఇప్పుడు పంచాయతీ ఎన్నికలు ఉన్నాయని రూ.12 వేలు మాత్రమే ఇచ్చి, మిగతా రూ.3 వేలు బాకీ పడ్డారని, దీంతో ప్రతి రైతుకు రూ.75 వేలు కాంగ్రెస్ బాకీ పడిందని తెలిపారు. కౌలు రైతులకు ఒక రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు.
- మహిళా హామీలు, పెన్షన్ల ఎగవేత: ఇంటికొక మహిళకు రూ.44 వేలు బాకీ పడ్డారని, 4,000 పెన్షన్ ఇస్తామన్న హామీని నేటికీ నెరవేర్చలేదని విమర్శించారు. అత్త, కోడలు ఇద్దరికీ ఇస్తామన్న రేవంత్ రెడ్డి మాటలు లిలి'గజినీకాంత్ మాటలు'లిలిలా ఉన్నాయని ఎద్దేవా చేశారు.
- విద్య, వైద్యం నిర్లక్ష్యం: కేసీఆర్ తొమ్మిదేళ్లలో రూ.20,000 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని, ఇది 'చేతకాని ప్రభుత్వం' అని ధ్వజమెత్తారు. ఫీజులు కట్టక ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లలకు సర్టిఫికెట్లు లేని పరిస్థితి వచ్చిందని, సగం కాలేజీలు మూతపడే విద్యా దానం చేసిందని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీ డబ్బులు చెల్లించక దావఖానాల్లో సేవలు బంద్ అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.
- తాగుబోతుల తెలంగాణ: యూరియా బస్తాలు ఇచ్చే తెలివి లేదు కానీ, ఊరూరా బెల్టు షాపులు, మైక్రోబ్రూవరీలు పెట్టి తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు.
- ఉద్యోగాలు బంద్: రూ.2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ చెప్పి మోసం చేశారని, జాబ్ క్యాలెండర్ కాస్తా జాబ్ లెస్ కేలండర్ అయిందని విమర్శించారు.
- సీఎంపై విమర్శలు: గ్యారంటీలకు 'టాటా' చెప్పి, లంక బిందెలకు 'వేట' పట్టిండు రేవంత్ రెడ్డి అంటూ హరీశ్ రావు వ్యంగ్యంగా మాట్లాడారు. కేసీఆర్ ప్రారంభించిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అధికారంలోకి వచ్చాక బంద్ చేసి, పర్సంటేజీలకు భయపడి కాంట్రాక్టర్లు టెండర్లు వేయని పరిస్థితి సృష్టించారని ఆరోపించారు.



## పెద్దమ్మ తల్లి సేవలో కేటీఆర్ దంపతులు

**అమ్మవారికి ప్రత్యేక పూజలు**

జూబ్లీహిల్స్/హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): జూబ్లీహిల్స్‌లోని ప్రసిద్ధ పెద్దమ్మతల్లి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్న నేపథ్యంలో, బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్ ఆలయాన్ని సందర్శించారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి ఆహ్వానం మేరకు ఆలయానికి చేరుకున్న కేటీఆర్, ఆయన సతీమణి శైలజ కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కేటీఆర్ దంపతులను ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు శరన్నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్ దంపతులు ఆలయాన్ని సందర్శించిన సందర్భంగా స్థానిక భక్తులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

## ట్రంప్ మరో పిడుగు

**కలప, ఫర్నిచర్‌పై 25 శాతం సుంకం**

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి టారిఫ్‌ల బాంబు పేల్చారు. ఈ ప్రకటనతో ఫర్నిచర్, కలప పై భారీ సుంకాలు విధించబడ్డాయి. ఇటీవల ట్రంప్ కిచెన్ క్యాబినెట్‌లు, బాత్‌రూమ్ పరికరాలు, అప్‌హోల్‌స్టర్డ్ ఫర్నిచర్, భారీ ట్రక్కులపై భారీ సుంకాలు విధిస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ప్రకారం కలపపై 10 శాతం, కిచెన్ క్యాబినెట్‌లు, అప్‌హోల్‌స్టర్డ్ ఫర్నిచర్‌పై 25 శాతం సుంకాలు అక్టోబర్ 14 నుంచి అమల్లోకి రానున్నాయి. చైనాతో సహా ఇతర దేశాల దిగుమతుల కారణంగా అమెరికాలో ఫర్నిచర్ వ్యాపార కేంద్రంగా ఉన్న నార్త్ కరోలినా ప్రాభవాన్ని కోల్పోయిందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. అమెరికాలో ఫర్నిచర్ తయారీని కొనసాగించకపోతే ఆయన భారీస్థాయిలో సుంకాలను విధిస్తానని ట్రూత్ సోషల్‌లో హెచ్చరించారు. అదేవిధంగా, సిమాలపై కూడా భారీ సుంకాలను ప్రకటించారు. యూఎస్ వెలుపల నిర్మించే సినిమాలపై 100 శాతం అదనపు టారిఫ్‌లు విధిస్తానని ట్రంప్ ప్రకటించడం భారతీయ చిత్ర పరిశ్రమపై తీవ్రమైన ప్రభావాన్ని చూపనుందని సూచిస్తున్నారు.

## నాగార్జున సాగర్‌లో హైదరాబాద్ విద్యార్థి గల్లంతు

నాగార్జునసాగర్, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): నాగార్జునసాగర్‌లో విషాదం చోటు చేసుకుంది. విహారయాత్రకు వెళ్లిన విద్యార్థి గల్లంతయ్యాడు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన ఆరుగురు విద్యార్థులు నాగార్జునసాగర్‌కు విహారయాత్ర నిమిత్తం వెళ్లారు. పుష్కర్ ఘాట్ వద్ద విద్యార్థులు సరదాగా ఫొటోలు దిగుతుండగా, 18 ఏళ్ల చాణక్య అనే విద్యార్థి ప్రమాదవశాత్తు నదిలో పడి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాన్ని రంగంలోకి దింపిగాలింపు చర్యలు చేపట్టారు. చాణక్య కోసం కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## సీఎం రేవంత్‌ను కలిసిన జూపల్లి

జూబ్లీహిల్స్/హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, టూరిజం డిపార్టుమెంట్ ఎండీ క్రాంతి ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల సరూర్ నగర్ మైదానంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ కార్యక్రమం గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించిన నేపథ్యంలో వారు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఆ వేడుకలో అతిపెద్ద బతుకమ్మ, అతిపెద్ద జానపద నృత్యంగా సరూర్ నగర్ బతుకమ్మ వేడుక రెండు గిన్నిస్ రికార్డులను సొంతం చేసుకుంది.

## గ్రూప్ 3 ప్రొవిజినల్ జాబితా విడుదల

**ప్రారంభమైన వెబ్ ఆప్షన్స్ ప్రక్రియ**

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): తెలంగాణ గ్రూప్-3 సర్వీస్ పోస్టుల ప్రొవిజినల్ సెలక్షన్ జాబితాను రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) తాజాగా విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ పెట్టుకునే ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమైంది. మొత్తం 1388 పోస్టులకు గానూ ప్రొవిజనల్ సెలక్షన్ లిస్ట్‌ను విడుదల చేసింది. ఈ జాబితాలో మెరిట్ ఆధారంగా 4,421 మంది అభ్యర్థులను జనరల్ కేటగిరీలో, అదనంగా 81 మందిని స్పోర్ట్స్ కోటా కింద ఎంపిక చేసింది. వీరంతా అక్టోబరు 10 సాయంత్రం 5.30 గంటల వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవడానికి అవకాశం కల్పిస్తారు. టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ లో అభ్యర్థులు తమ ప్రాధాన్యతలను నేటి నుంచి నమోదు చేసుకోవల్సి ఉంటుంది. ఈ వెబ్ ఆప్షన్స్ ప్రక్రియ ఈ రోజు నుంచి ప్రారంభమై అక్టోబర్ 10వ తేదీ సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగనుంది. ఎంపికైన అభ్యర్థులు గడువులోగా తమ ఆప్షన్లను నమోదు చేసుకోవాలని స్పష్టం చేసింది.

# హైదరాబాద్ సీపీగా సజ్జనార్ బాధ్యతలు

**డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని వెల్లడి**



హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): సైబర్ నేరాలపై అవగాహన, అప్రమత్తత కొరవడటంతో చాలామంది నష్టపోతున్నారని హైదరాబాద్ సీపీ సజ్జనార్ అన్నారు. నగర నూతన సీపీగా ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, హైదరాబాద్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని ఆయన అన్నారు. నగరంలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటని, కానీ ఇక్కడ మనం డ్రగ్స్ సమస్యను ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. డ్రగ్స్ సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సజ్జనార్ అన్నారు. ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళతామని ఆయన అన్నారు. అవసరమైతే మరింత సిబ్బందిని కేటాయించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగరంలో సైబర్ నేరాలను అరికట్టేందుకు అనేక చర్యలు చేపట్టామని ఆయన అన్నారు. నేరగాళ్లు ఎక్కువగా వృద్ధులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలంతా అవగాహన పెంచుకోవాలని అన్నారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో వచ్చే కాల్స్‌పై జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల యువత బాగా చెడిపోతోందని, అలాంటి వాటిని ప్రోత్సహించవద్దని ప్రముఖులను కోరారు. డిజిటల్ అరెస్టుల పేరుతో వచ్చే కాల్స్‌ను విశ్వసించవద్దని ఆయన అన్నారు. అలాగే అరుదైన వ్యాధులకు ఔషధాలు అని చెప్పే వారిని కూడా నమ్మవద్దని హితవు పలికారు. ఆన్‌లైన్ మోసాలు చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. కల్తీ ఆహారంపై ప్రత్యేక దృష్టి పెడతామని సజ్జనార్ వెల్లడించారు. ఇందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. మార్కెట్ ఇంటెలిజెన్స్ వ్యవస్థను ఏర్పాటు చేసి కల్తీ నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని ఆయన అన్నారు. ట్రాఫిక్ సమస్యను తగ్గించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ట్రాఫిక్ సమస్య వల్ల సమయం వృథా కావడంతో పాటు ఆరోగ్యం కూడా పాడవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారులు, మహిళలపై అఘాయిత్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



# జూబ్లీహిల్స్‌లో 3.99 లక్షల ఓటర్లు

**తుది ఓటర్ల జాబితా ప్రచురించిన ఈసీ**

జూబ్లీహిల్స్/హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి త్వరలో ఉప ఎన్నికలు జరగనున్నాయి. మంగళవారం ప్రచురించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం ఈ నియోజకవర్గంలో 3,99,000 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో 2,07,382 మంది పురుష ఓటర్లు, 1,91,593 మంది మహిళా ఓటర్లు, 25 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారని ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ నియోజకవర్గంలో ప్రతి 1,000 మంది పురుషులకు 924 మంది మహిళలు ఉన్నారు. ఓటర్లలో 18-19 ఏళ్ల వయస్సు ఉన్నవారు 6,106 మంది, 80 ఏళ్లు పైబడిన వారు 2,613 మంది, 1,891 మంది వికలాంగులు ఉన్నారు. దివ్యాంగుల ఓటర్లలో 519 మంది దృష్టి లోపం ఉన్నవారు, 667 మంది లోకోమోటివ్ వైకల్యం ఉన్నవారు, 311 మంది మూగ లేదా చెవిటి వారు, 722 మంది ఇతర వైకల్యం కలిగిన వారు ఉన్నట్లు తెలిపారు. 95 మంది విదేశీ ఓటర్లు ఉన్నట్లు తుది ఓటర్ల జాబితా వెల్లడించింది. సెప్టెంబర్ 2న విడుదలైన ముసాయిదా జాబితాలో మొత్తం 3,92,669 మంది ఓటర్లు ఉండగా, 6,976 కొత్త పేర్లను చేర్చడం, 663 మందిని తొలగించడంతో, ఈ సంఖ్య 3,98,982కు చేరుకుంది. సర్వీస్ ఓటర్లతో పాటు, మొత్తం ఓటర్ల సంఖ్య ఇప్పుడు 3,99,000కు చేరుకుంది. నియోజకవర్గంలోని 139 ప్రాంతాల్లో 407 పోలింగ్ కేంద్రాలలో ఉప ఎన్నికకు పోలింగ్ జరగనుంది. ప్రతి పోలింగ్ కేంద్రానికి సగటున 980 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్లు తుది ఓటర్ల జాబితాలో తమ పేర్లను ధృవీకరించుకోవచ్చుని, నామినేషన్ల స్వీకరణ చివరి రోజు వరకు అభ్యంతరాలు ఏవైనా ఉంటే సమర్పించవచ్చుని ఎన్నికల అధికారి తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో 3,85,287 మంది ఓటర్లు ఉండగా, ఇప్పుడు ఓటర్ల సంఖ్య 3.49 శాతం పెరిగింది. బీహార్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలతో పాటు తెలంగాణ సహా ఎనిమిది రాష్ట్రాలలో ఉప ఎన్నికలను పర్యవేక్షించడానికి కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకులను నియమించింది. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక అనివార్యమైంది. ఉప ఎన్నికల్లో మాగంటి సునీతను బీఆర్ఎస్ తన అభ్యర్థిగా ప్రకటించింది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అభ్యర్థులను ప్రకటించవలసి ఉంది.

## కోర్టులో చెల్లదని తెలిసినా.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటన

**బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్**



హనుమకొండ, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): కోర్టులో చెల్లవని తెలిసినా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించి గందరగోళానికి గురి చేస్తున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఎవరిని మోసం చేయడానికి ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారని ఆయన ప్రశ్నించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ, బీహార్, మహారాష్ట్రలలో రిజర్వేషన్లపై నమోదైన పలు కేసులను సుప్రీంకోర్టు కొట్టివేసిందని అన్నారు. ఎవరూ కోర్టుకు వెళ్లవద్దని ముగ్గురు మంత్రులు చెబుతున్నారని, కోర్టుకు వెళితే అభ్యంతరం ఏమిటని ప్రశ్నిస్తున్నానని ఈటల అన్నారు. ఎన్నికల్లో ఓటు కోసం డబ్బులు ఖర్చు పెట్టవద్దని రాష్ట్ర ఎన్నికల కమిషన్ చెబుతోందని అన్నారు. నల్గొండ జిల్లాలోని గిరిజన తండాల్లో బీసీలు లేకున్నా రిజర్వేషన్ ప్రకటించారని విమర్శించారు. తమ పార్టీ తరఫున శాసనసభలో, మండలిలో పూర్తిగా మద్దతు ఇచ్చామని అన్నారు. రిజర్వేషన్ల విషయంలో బీజేపీని అనవద్దని సూచించారు.

## జీహెచ్ఎంసీ ఉద్యోగులకు 1.25 కోట్ల ప్రమాద బీమా



హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): దసరా పండుగ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) తమ ఉద్యోగులకు భారీ శుభవార్త అందించింది. పారిశుధ్య కార్మికుడి నుంచి ఉన్నతాధికారి వరకు అందరికీ వర్తించేలా, ఎలాంటి ప్రీమియం భారం లేకుండా రూ.30 లక్షల నుంచి రూ.1.25 కోట్ల వరకు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)తో జీహెచ్ఎంసీ ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఇటీవల వినాయక నిమజ్జనం విధుల్లో ఉన్న పారిశుధ్య కార్మికురాలు రేణుక ప్రమాదవశాత్తు మరణించిన ఘటన అందరినీ కలచివేసింది. ఈ నేపథ్యంలో విధి నిర్వహణలో తరచూ ప్రమాదాలకు గురయ్యే కార్మికులు, ఇతర సిబ్బంది కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఈ చొరవ తీసుకున్నారు. సింగరేణి సంస్థ తమ కార్మికులకు అందిస్తున్న బీమా విధానాన్ని ఆదర్శంగా తీసుకుని ఈ పథకాన్ని రూపొందించారు. దీని ప్రకారం రూ.25 వేల లోపు వేతనం పొందే వారికి రూ.30 లక్షలు, రూ.25 వేల నుంచి రూ.75 వేల మధ్య జీతం ఉన్నవారికి రూ.50 లక్షలు ప్రమాద బీమా లభిస్తుంది. అలాగే, రూ.75 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు వేతనం ఉన్నవారికి రూ.కోటి, రూ.1.50 లక్షలకు పైగా జీతం అందుకునే వారికి రూ.1.25 కోట్ల బీమా కవరేజీ వర్తిస్తుందని అధికారులు తెలిపారు. ఈ పథకంలో మరిన్ని ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ప్రమాదంలో శాశ్వత అంగవైకల్యం సంభవిస్తే బీమా మొత్తంలో సగం పరిహారంగా అందుతుంది. ఒకవేళ విమాన ప్రమాదంలో మరణిస్తే బీమా మొత్తం రెట్టింపు అవుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో పండుగ వేళ ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందం.




## తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌గా బోర్డు!

సెక్రటేరియట్/హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని కీలకమైన ఫ్లైఓవర్లలో ఒకటైన 'తెలుగు తల్లి' ఫ్లైఓవర్ పేరు మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఫ్లైఓవర్ పేరును 'తెలంగాణ తల్లి' ఫ్లైఓవర్‌గా మారుస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కొత్త పేరుతో కూడిన బోర్డును సైతం ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటు చేయడంతో ఈ మార్పు అధికారికంగా అమల్లోకి వచ్చింది. రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయం సమీపంలో ఈ ఫ్లైఓవర్ ఉంది. ఇప్పటివరకు 'తెలుగు తల్లి' ఫ్లైఓవర్‌గా అందరికీ సుపరిచితమైన ఈ ఫ్లైఓవర్... ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇకపై 'తెలంగాణ తల్లి' ఫ్లైఓవర్‌గా గుర్తింపు పొందనుంది. నగరంలోని ప్రధాన కూడళ్లను కలిపే ఈ మార్గంలో అధికారులు కొత్త పేరును సూచిస్తూ బోర్డును ఏర్పాటు చేశారు.

## సోషల్ వాణి




ఎవడ్రా జీఎస్టీ తగ్గితే సరుకుల రేట్లు తగ్గుతాయని చెప్పింది? పాల ప్యాకెట్‌కు అదే రేటుంది. ఉప్పు మిర్పకాయకు అదే రేటుంది. ఇదేంటని అడిగితే.. పాత సరుకు అని చెబుతుండ్రు.

- వేణు బెక్కం



# స్థానిక ఎన్నికలకు పటిష్ఠ కార్యాచరణ

**జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ వెల్లడి**

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో ప్రశాంతంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రెండు విడతలలో స్థానిక సంస్థలను, రెండు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో మొదటి విడతలో 10 మండలాలు, రెండవ విడుదల 10 మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికల జరుగుతాయని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ అదనపు భద్రత బలగాలు ఉండేలా చూడాలని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వెంటనే ఎన్నికలు జరిగే గ్రామీణ ప్రాంతాలలో అమలులోకి వస్తుందని తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేసేలా ఎంసీసీ నిబంధనలకు విరుద్ధంగా అర్బన్ ప్రాంతాలలో, సోషల్ మీడియా ద్వారా ఉల్లంఘనలు చేస్తే వారిపై ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామని, సిబ్బందికి ఎన్నికల విధుల నిర్వహణ పట్ల శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని, శాంతి భద్రతలు కూడా అదుపులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజా గౌడ్ , జడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి, డీపీవో మదన్ మోహన్, జిల్లా నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**అనుమతులతోనే గోడ పత్రికలు**

ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలకు సంబంధించిన గోడ రాతలు, గోడ పత్రికలు, ఫ్లెక్సీ బ్యానర్లు తొలగించాలని ఆయా పార్టీల ప్రతినిధులను కలెక్టర్ కోరారు. ఎన్నికలు జరుగు ప్రాంతాల్లో అనుమతులు లేని సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. ఎన్నికల నిబంధనలకు లోబడి అనుమతులు తీసుకొని సమావేశాలు, గోడ రాతుల, గోడ పత్రికలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేయనున్నట్లు వెల్లడించారు. సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ నెంబర్9666234383కు కాల్ చేయాలన్నారు.

## ఆడది ఒక అడ్మినిస్ట్రేటర్

**టీడీపీ సీనియర్ నేత జేసీ దివాకర్ రెడ్డి**

తాడిపత్రి, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): నిత్యం తన రాజకీయ విమర్శలతో వార్తల్లో నిలిచే టీడీపీ సీనియర్ నేత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఈసారి అందుకు భిన్నంగా మహిళలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గృహిణి (హౌస్‌వైఫ్) పాత్రను తక్కువగా అంచనా వేయొద్దని, ఆమె ఒక అడ్మినిస్ట్రేటర్‌తో సమానమని ఆయన అభివర్ణించారు. సమాజానికి మేలు చేయాలనే తపన ఉన్న మహిళలు సామాజిక సేవ కోసం ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. తాడిపత్రిలో నెలకొన్న పలు సమస్యలపై స్పందించిన జేసీ ప్రభాకర్ రెడ్డి, ముఖ్యంగా అండర్ డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణలో పట్టణం వెనుకబడి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీలలో వ్యర్థ పదార్థాలను వేయడం వల్లే ఈ సమస్య తీవ్రమవుతోందని, దీని పరిష్కారానికి మహిళల సహాయ సహకారాలు ఎంతో అవసరమని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలోనే ఆడపిల్లలు, మహిళలు సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. "తాడిపత్రి బాగుండాలి అని కోరుకునే ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. త్వరలోనే దీనిపై ఒక మీటింగ్ ఏర్పాటు చేస్తా" అని జేసీ తెలిపారు. చేతికి చీపురు (పరక) పట్టాలంటే ధైర్యం ఉండాలని, మంచి పనులు చేయడం ద్వారా సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలని ఆయన మహిళలకు హితవు పలికారు. ఈ సందర్భంగా భవిష్యత్తు పరిస్థితులపై జేసీ ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. "త్వరలో నెలకు రెండు లక్షల రూపాయలు జీతం ఇచ్చినా పనిచేసే వారు దొరకరు. అలాంటి రోజులు రాబోతున్నాయి" అంటూ ఆయన జోస్యం చెప్పారు. అందువల్ల ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని పరోక్షంగా సూచించారు.

## రైలుకు ఎదురెళ్లి ప్రేమికుల సూసైడ్

పల్నాడు జిల్లా, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): పెద్దలు తన ప్రేమకు అభ్యంతరం చెప్పారని కలత చెందిన యువకుడు రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలిసి ఆ యువకుడి ప్రియురాలు కూడా అదే చోట బలవన్మరణానికి పాల్పడింది. ఈ విషాదకర సంఘటన ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా మేడికొండూరు మండలంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం దమ్మాలపాడుకు చెందిన కోటె గోపీకృష్ణ(20), తెనాలి మండలం అత్తోటకు చెందిన బొల్లిముంత లక్ష్మీ ప్రియాంక(20) ఎన్ఆర్ఐఐటీ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. ఇద్దరూ వేర్వేరు హాస్టళ్లలో ఉంటున్నారు. కొంతకాలంగా వీరిద్దరూ ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం ఇంట్లో వాళ్లకు తెలిస్తే ఒప్పుకోరేమోనని అనుమానించి పోలీసులను ఆశ్రయించారు. ఈ నెల 5న గుంటూరు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌ను కు వెళ్లి రక్షణ కోరారు. తామిద్దరం పెళ్లి కూడా చేసుకున్నామని చెప్పారు. దీంతో ఇరువురి కుటుంబాలను స్టేషన్ కు పిలిపించిన పోలీసులు.. ఆ కుటుంబాలకు, ప్రేమ జంటకు కౌన్సెలింగ్ చేశారు. అయినా పెద్దలు వారి పెళ్లికి అంగీకరించకపోవడంతో మనస్తాపం చెందిన గోపీకృష్ణ, లక్ష్మీ ప్రియాంక తాము సొంతంగానే బతుకుతామని వెళ్లిపోయారు. ఈ క్రమంలోనే ఈ నెల 27న సాయంత్రం గుంటూరు నుంచి మార్కాపురం వైపు వెళ్లే ఓ రైలుకు ఎదురెళ్లి గోపికృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలిసి లక్ష్మీ ప్రియాంక మరుసటి రోజు అదే ప్రాంతంలో రైలు కింద పడి మృతి చెందింది. రైల్వే పోలీసులు మృతదేహాలను నరసరావుపేట ప్రాంతీయ ఆసుపత్రి తరలించారు.

## పూర్వోదయకు నిధులివ్వండి

**కేంద్ర మంత్రి నిర్మలకు చంద్రబాబు వినతి**

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతాల ఆర్థిక ప్రగతికి 'పూర్వోదయ' పథకం కింద ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తన ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన నేడు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమై ఈ మేరకు ఒక వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ఈ నిధులే కీలకమని ఆయన నొక్కిచెప్పారు. దేశంలోని తూర్పు ప్రాంతాల్లో ఉన్న రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి కోసం పూర్వోదయ పథకానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఏపీపై దృష్టి పెట్టాలని సీఎం విజ్ఞప్తి చేశారు. పూర్వోదయ పథకంలో భాగంగా బీహార్, జార□ండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశారు. పూర్వోదయ నిధులతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. రాయలసీమలో హార్టికల్చర్, ఉత్తరాంధ్రలో కాఫీ పంట ఉత్పత్తులు, జీడి, కొబ్బరి తోటలు, కోస్తాంధ్రలో ఆక్వా కల్చర్‌ను ప్రోత్సహించేలా ప్రణాళికలు రూపొందించినట్లు సీఎం తన విజ్ఞాపన పత్రంలో పేర్కొన్నారు. ఈ రంగాల్లో చేపట్టే ప్రాజెక్టులకు కేంద్రం పూర్వోదయ పథకంలో నిధులు కేటాయిస్తే మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఎకనమిక్ డెవలప్మెంట్ కు పూర్వోదయ పథకం అమలు ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. వెనుకబడిని ప్రాంతాల ఆర్థిక అభివృద్ధికి దోహదం చేసేలా ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ ను కోరారు. అనంతరం కేంద్ర జలశక్తి శాఖామంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. పోలవరం పనుల పురోగతిని గురించి కేంద్రమంత్రికి సీఎం వివరించారు.

## బీహార్ ఓటర్ల తుది జాబితా విడుదల

పాట్నా: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) పూర్తయిన తర్వాత బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మంగళవారం ప్రచురించింది. ఏ ఓటరు అయినా తన ఓటరు నమోదు వివరాలను భారత ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో వీక్షించవచ్చని పోల్ బాడీ అధికారులు తెలియజేశారు. రాష్ట్రంలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు ఈ జాబితా ఆధారంగానే నిర్వహించనున్నారు. 2025, అక్టోబర్ ఆరు- ఏడు తేదీల మధ్య ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి. 22 ఏళ్ల విరామం తర్వాత బీహార్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ కసరత్తు రాజకీయ, చట్టపరమైన చర్చలకు కేంద్రంగా నిలిచింది. ఆగస్టు ఒకటిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురితం కాగా, సెప్టెంబర్ ఒకటి వరకు అభ్యంతరాల కోసం గడువు ఇచ్చారు. ప్రక్రియకు ముందు, బీహార్‌లో 7.89 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు.






# దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షో

**వన్డే ప్రపంచకప్‌లో భారత మహిళ జట్టు బోణీ.. తొలిపోరులో శ్రీలంకకు షాకిచ్చిన టీమిండియా**

సొంతగడ్డపై జరుగుతున్న వన్డే ప్రపంచ కప్‌లో భారత మహిళల జట్టు బోణీ కొట్టింది. దీప్తి శర్మ(53, 3-54) ఆల్‌రౌండ్ షోతో శ్రీలంకను దెబ్బకొట్టగా 59 పరుగుల తేడాతో టీమిండియా జయభేరి మోగించింది. అమన్‌జోత్ కౌర్ (57), దీప్తిలు అర్ధ శతకాలతో భారీ స్కోర్ అందించగా.. బంతితో స్పిన్నర్లు లంకను పడగొట్టారు. స్నేహ్ రానా(2-32), తెలుగమ్మాయి శ్రీ చరణి(2-37)లు తిప్పేయగా లంక 211కే ఆలౌటయ్యింది. దాంతో.. తొలి ప్రపంచ కప్ వేటలో ఉన్న హర్మన్‌ప్రీత్ కౌర్ సేన తొలి అడుగు ఘనంగా వేసింది. పదమూడో సీజన్ వన్డే వరల్డ్ కప్ పోటీలకు ఆతిథ్యమిస్తున్న భారత్ కో హస్ట్ శ్రీలంకను చిత్తు చేసింది. వన్డేల్లో తమ ఆధిపత్యాన్ని చెలాయిస్తూ విజయం సాధించింది. డక్ వర్త్ లూయిస్ ప్రకారం జరిగిన 48 ఓవర్ల మ్యాచ్‌లో తొలుత అర్ధ శతకంతో జట్టును ఆదుకున్న దీప్తి శర్మ(53) బంతితో వికెట్ల వేటతో శ్రీలంకను కష్టాల్లోకి నెట్టింది. ఓపెనర్ చమరి ఆటపట్టు(43)ను ఔట్ చేసిన దీప్తి.. ఆతర్వాతి ఓవర్లలో డేంజరసర్ కవిష దిల్హారి(15), అనుష్క సంజీవని(6)లను పెవిలియన్ పంపింది. దీప్తి సంధించిన ఫుల్ డెలివరీని సంజీవని మిడాన్‌లో ఆడబోయి హర్మన్‌ప్రీత్ కౌర్‌కు దొరికిపోయింది. దాంతో.. 140 వద్ద లంక ఆరో వికెట్ కోల్పోయింది.

# జనరల్ రైలు టికెట్‌కూ ఆధార్

**నేటి నుంచి అమల్లోకి కొత్త రైల్వే రూల్**




న్యూఢిల్లీ: భారతీయ రైల్వే ఇటీవల కీలక నిర్ణయం తీసుకున్నది. నిబంధనల్లో పలు మార్పులు చేసింది. జనరల్ రిజర్వేషన్ టికెట్లకు సైతం ఆధార్ అథంటికేషన్‌ను తప్పనిసరి చేసింది. ఈ నిబంధన అక్టోబర్ ఒకటి నుంచి అమలులోకి రానున్నది. మారిన నిబంధనల ప్రకారం.. జనరల్ రిజర్వేషన్ల టికెట్లను బుక్ చేసుకునే సమయంలో ఆధార్ నంబర్‌ను తప్పనిసరిగా ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అయితే, టికెట్లు ఓపెన్ అయిన 15 నిమిషాల వరకు మాత్రమే ఆధార్ నిబంధన వర్తిస్తుంది. రైల్వే టికెట్ల బుకింగ్ వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడంతో పాటు మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు రైల్వే బోర్డు ఈ కీలక నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపింది. ఈ నిబంధన ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ రెండింటిలోనూ వర్తిస్తుందని రైల్వేశాఖ పేర్కొంది. వాస్తవానికి రైల్వే టికెట్లు అందుబాటులోకి వచ్చిన వెంటనే ఏజెంట్లు, బ్రోకర్లు కొన్ని సాఫ్ట్‌వేర్ల సహాయంతో ముందస్తుగానే టికెట్లను బుక్ చేస్తున్నట్లుగా రైల్వే గుర్తించింది. దాంతో సాధారణ రైల్వే ప్రయాణికులు టికెట్లు పొందలేకపోతున్నారు. అయితే, రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్ బుకింగ్ విషయంలో ఎలాంటి మార్పులు చేయలేదు. ఇందుకు అనుగుణంగా సాంకేతిక మార్పులు చేసుకోవాలని రైల్వేబోర్డు అన్ని రైల్వేలు, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఐఆర్‌సీటీసీని సర్క్యులర్‌ను పంపింది. ప్రస్తుతం జనరల్ రిజర్వేషన్ కోసం బుకింగ్‌ను ప్రతిరోజూ అర్ధరాత్రి 12.20 గంటలకు మొదలై.. రాత్రి 11.45 గంటల వరకు కొనసాగుతుంది. మిగతా సమయాల్లో మేయింటనెన్స్ పనులు జరుగుతాయి. జనరల్ టికెట్ల అడ్వాన్స్ టికెట్ బుకింగ్ ఏదైనా రైలు ప్రయాణ తేదీకి 60 రోజుల ముందు మొదలవుతుంది. అర్ధరాత్రి 12.20 గంటలకు టికెట్లు బుక్ చేసుకునే అవకాశం ఉంటుంది. అంటే ఇకపై ఎవరైనా సంబంధిత రైలు టికెట్లు విడుదలయ్యే 15 నిమిషాల ముందు తప్పనిసరిగా ఆధార్ అథంటికేషన్ చేస్తేనే టికెట్లు బుక్ అయ్యే అవకాశం ఉ ంటుంది. లేకపోతే టికెట్లు బుక్ అయ్యే అవకాశం ఉండదు. 15 నిమిషాలు ఆగాల్సి ఉంటుంది. అప్పటి వరకు టికెట్లు ఉంటేనే బుక్ చేసుకునే వీలుంటుంది. రైల్వే నిర్ణయంతో సాధారణ ప్రయాణికులకు ఎంతో ఊరట లభించనున్నది. పండుగల సమయంలో రైళ్ల టికెట్లకు భారీగా గిరాకీ ఉంటుంది. బుకింగ్ మొదలైన కొద్ది సమయంలోనే కొన్ని రైళ్లలో టికెట్లు నిండిపోతున్నాయి. డిమాండ్‌ను ఆసరా చేసుకొని ఏజెంట్లు, బ్రోకర్లు మోసపూరిత పద్ధతుల్లో టికెట్లను బ్లాక్ చేస్తున్నట్లుగా రైల్వే గుర్తించింది. ఈ క్రమంలో ఆధార్ అథంటికేషన్‌తో ప్రయాణికులకు ఊరట లభించనున్నది. ప్రస్తుతం తత్కాల్ టికెట్లకు అమలు చేస్తున్న ఈ విధానం జనరల్ టికెట్లకు అమలు చేస్తున్నది.

# ఎయిర్ బస్ కోసం ఏపీ ముందడుగు

న్యూఢిల్లీ: ఏపీని ఏరోస్పేస్ రంగంలో కీలక కేంద్రంగా మార్చే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో ముఖ్యమైన ముందడుగు వేసింది. ప్రపంచ ప్రఖ్యాత విమానాల తయారీ సంస్థ ఎయిర్‌బస్‌ను రాష్ట్రానికి ఆహ్వానించేందుకు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో ఆ సంస్థ పూర్తిస్థాయి బోర్డుతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. 'మేకిన్ ఇండియా' అవకాశాలను పరిశీలించేందుకు తొలిసారిగా భారత్‌కు వచ్చిన ఎయిర్‌బస్ బోర్డు ముందు మంత్రి లోకేశ్ ఒక ఆకర్షణీయమైన ప్రతిపాదన ఉంచారు. ఈ భేటీలో ఎయిర్‌బస్ ఛైర్మన్ రెనీ ఒబెర్మన్‌తో పాటు సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఏపీలో కేవలం ప్రధాన యూనిట్‌ను మాత్రమే కాకుండా, దానికి అనుబంధంగా టైర్-1, టైర్-2 సరఫరాదారులు, ఇతర భాగస్వాములతో కూడిన ఒక ఇంటిగ్రేటెడ్ ఏరోస్పేస్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. దీనివల్ల తయారీ ప్రక్రియ వేగవంతం అవ్వడమే కాకుండా, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగి, తక్కువ ఖర్చుతో ఉత్పత్తి సాధ్యమవుతుందని వివరించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ఏపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని లోకేశ్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న భూమి, పరిశ్రమలకు అనుకూలమైన ఏరోస్పేస్ పాలసీ, టెక్నాలజీ బదిలీకి ఉన్న సానుకూలతలను ఆయన వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు పెట్టుబడులను ఆకర్షించడంలో ఉన్న ట్రాక్ రికార్డును, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. సింగిల్ విండో విధానంలో వేగంగా అనుమతులు ఇస్తామని, ప్రాజెక్టును నిర్దేశిత సమయంలో పూర్తి చేసేందుకు అన్ని విధాలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ పెట్టుబడి ద్వారా రాష్ట్రాన్ని ఎగుమతి ఆధారిత ఏరోస్పేస్ హబ్‌గా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ తెలిపారు. అభివృద్ధి చేస్తున్న ఏరోస్పేస్ కారిడార్లలో ఎయిర్‌బస్ అవసరాలకు తగినట్టుగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఆయన బోర్డుకు హామీ ఇచ్చారు.






## అల్కరాజ్.. ఆగేదేలే!

**జపాన్ ఓపెన్ ఫైనల్లో విజయం**

**ఏడాదిలో ఎనిమిదో టైటిల్**

వరల్డ్ నంబర్ 1 కార్లోస్ అల్కరాజ్ జోరు మీదున్నాడు. ఇటీవలే యూఎస్ ఓపెన్ ట్రోఫీ గెలుపొందిన ఈ స్పెయిన్ స్టార్.. జపాన్ ఓపెన్‌లోనూ ట్రోఫీని ఎగరేసుకుపోయాడు. మంగళవారం జరిగిన ఫైనల్లో టేలర్ ఫ్రిట్జ్‌ను ఓడించాడు. ఈ సీజన్‌లో 68వ విజయం నమోదు చేయడంతో పాటు ఎనిమిదో టైటిల్ సొంతం చేసుకోవడం గమనార్హం. పురుషుల టెన్నిస్‌లో అల్కారాజ్ దూకుడుకు ప్రత్యర్థులు తోకముడుస్తున్నారు. జనిక్ సిన్నర్‌కు చెక్ పెట్టిన అతడు ఈసారి అమెరికాకు చెందిన టేలర్ ఫ్రిట్జ్ టైటిల్ ఆశలపై నీళ్లు చల్లాడు. మంగళవారం జరిగిన ఫైనల్లో అల్కరాస్ ధాటికి స్విఫ్ట్ నిలువలేకపోయాడు. తొలి సెట్‌ను 6-4తో కైవసం చేసుకున్న అతడు రెండో సెట్‌లోనూ అదే దూకుడు కనబరిచాడు. ఇంకేముంది అమెరికా సంచనలంపై లావెర్ కప్ ఓటమికి ప్రతీకారం తీర్చుకుంటూ 6-4తో గెలుపొందాడు అల్కరాజ్. దాంతో, ఏటీపీ టూర్‌లో అతడు 24వ టైటిల్ సాధించాడు. 'టోక్యోలో జపాన్ అభిమానుల సమక్షంలో ఫైనల్ ఆడడం చాలా ఒత్తిడిగా అనిపించింది.

# ఒత్తిడి వల్లే పాక్‌పై దాడి చేయలేదు

**కేంద్ర మాజీ హెూం మంత్రి చిదంబరం సంచలన వ్యాఖ్యలు.. 2008 ముంబై దాడుల తర్వాత ప్రతీకారంపై వెల్లడి**



**2008 ముంబై ఉగ్రదాడుల తర్వాత పాకిస్థాన్‌పై ప్రతీకార దాడి ఎందుకు చేయలేదనే విషయంపై కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర హెూంశాఖ మాజీ మంత్రి పి. చిదంబరం సంచలన విషయాలు వెల్లడించారు. తీవ్రమైన అంతర్జాతీయ ఒత్తిడి, అప్పటి విదేశాంగ మంత్రిత్వ శాఖ వైఖరి కారణంగానే యూపీఏ ప్రభుత్వం సైనిక చర్యకు దూరంగా ఉండాలని నిర్ణయించుకుందని ఆయన అంగీకరించారు. చిదంబరం చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపగా, బీజేపీ ఆయనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది.**

న్యూఢిల్లీ: ఒక వార్తా చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చిదంబరం మాట్లాడుతూ 175 మంది ప్రాణాలను బలిగొన్న ముంబై దాడుల తర్వాత తనకు వ్యక్తిగతంగా ప్రతీకార చర్య చేపట్టాలనే ఆలోచన వచ్చిందని తెలిపారు. "ఆ దాడుల తర్వాత నేను హెూం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కొన్ని రోజులకే ప్రపంచ దేశాలన్నీ ఢిల్లీకి తరలివచ్చి 'యుద్ధం వద్దు' అని చెప్పాయి. అప్పటి అమెరికా విదేశాంగ మంత్రి కండోలీజా రైస్ నేరుగా నాతో, ప్రధానమంత్రితో సమావేశమై, దయచేసి స్పందించవద్దని కోరారు" అని చిదంబరం వివరించారు. ప్రతీకార చర్యల విషయంపై తాను అప్పటి ప్రధానితో, ఇతర ముఖ్యులతో చర్చించానని చిదంబరం గుర్తుచేసుకున్నారు. "ప్రధానంగా విదేశాంగ శాఖ, ఐఎఫ్ఎస్ అధికారుల సలహా మేరకే భౌతికంగా స్పందించకూడదని ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చింది" అని ఆయన స్పష్టం చేశారు. చిదంబరం వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఇది చాలా ఆలస్యంగా చేసిన ఒప్పుకోలు అని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి విమర్శించారు. విదేశీ శక్తుల ఒత్తిడితోనే యూపీఏ ప్రభుత్వం ముంబై దాడుల విషయంలో విఫలమైందన్న విషయం ఇప్పుడు రుజువైందని ఆయన అన్నారు. బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా మాట్లాడుతూ చిదంబరం ప్రతీకార చర్యకు మొగ్గు చూపినా, ప్రభుత్వంలోని "ఇతరులు" దానిని అడ్డుకున్నారని ఆరోపించారు. "అప్పటి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ లేదా ప్రధాని మన్మోహన్ సింగ్ ఈ నిర్ణయాన్ని అడ్డుకున్నారా? కండోలీజా రైస్ ఆదేశాల మేరకు యూపీఏ ప్రభుత్వం ఎందుకు పనిచేసింది?" అని ఆయన ప్రశ్నించారు. ముంబై దాడులతో పాటు సంఝౌతా ఎక్స్‌ప్రెస్ పేలుళ్ల విషయంలోనూ పాకిస్థాన్‌కు కాంగ్రెస్ క్లీన్ చిట్ ఇచ్చిందని 'హిందూ ఉగ్రవాదం' అనే కథనాన్ని ప్రచారం చేసిందని పూనావాలా ఆరోపించారు.

## అరట్టై జోరు..!

### 185 రైట్లు పెరిగిన డౌన్‌లోడ్స్

చెన్నై: ప్రముఖ టెక్ సంస్థ జోహెూ కార్పొరేషన్‌కు చెందిన స్వదేశీ మెసేజింగ్ యాప్ 'అరట్టై' అనూహ్యమైన ఆదరణతో దూసుకెళుతోంది. ఈ యాప్‌ను వాట్సాప్‌లాంటి క్లోజ్డ్ నెట్‌వర్క్‌గా కాకుండా, యూపీఐ, ఈమెయిల్ తరహాలో స్వేచ్ఛాయుత (ఓపెన్) ప్లాట్‌ఫామ్‌గా తీర్చిదిద్దుతామని సంస్థ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ సైంటిస్ట్ శ్రీధర్ వెంబు మంగళవారం స్పష్టం చేశారు. సెప్టెంబర్ 21 నుంచి 27 మధ్య వారం రోజుల్లోనే అరట్టై యాప్ డౌన్‌లోడ్లు ఏకంగా 185 రెట్లు పెరిగాయని సెన్సార్ టవర్ డేటా వెల్లడించింది. ఇదే సమయంలో రోజువారీ యాక్టివ్ యూజర్ల సంఖ్య 40 రెట్లు పెరిగింది. ప్రభుత్వ ప్రతినిధులు ఈ యాప్ గురించి ప్రస్తావించిన తర్వాతే డౌన్‌లోడ్లు ఒక్కసారిగా పెరిగాయని తెలుస్తోంది. గతంలో రోజుకు 300గా ఉన్న డౌన్‌లోడ్లు, సెప్టెంబర్ 25 నుంచి సగటున లక్షకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీధర్ వెంబు మాట్లాడుతూ, "మాకు గుత్తాధిపత్యం (మోనోపలీ) సాధించాలనే ఆలోచన లేదు. యూపీఐని నేను ఎంతగానో అభిమానిస్తాను, దాని రూపకర్తల పనితీరును గౌరవిస్తాను. ఈమెయిల్, యూపీఐ మాదిరిగానే అరట్టై కూడా సురక్షితమైన, స్వేచ్ఛాయుత వేదికగా ఉండాలన్నదే మా లక్ష్యం" అని వివరించారు. అరట్టై సహా తమ ఉత్పత్తులన్నీ భారత్‌లోనే తయారయ్యాయని శ్రీధర్ వెంబు స్పష్టం చేశారు. యూజర్ల డేటాను పూర్తిగా దేశంలోని ముంబై, ఢిల్లీ, చెన్నైలలోని డేటా సెంటర్లలోనే భద్రపరుస్తున్నామని, ఒడిశాలో కొత్త కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. తాము అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) లేదా గూగుల్ క్లౌడ్ వంటి పబ్లిక్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించడం లేదని, సొంత హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌పైనే ఆధారపడతామని ఆయన తేల్చిచెప్పారు. ఆకస్మికంగా పెరిగిన యూజర్ల వల్ల సాంకేతిక సవాళు ఎదురయ్యాయని కంపెనీ పేర్కొంది. కేవలం మూడు రోజుల్లోనే రోజువారీ రిజిస్ట్రేషన్లు 3,000 నుంచి 3.5 లక్షలకు చేరడంతో, అత్యవసరంగా మౌలిక సదుపాయాలను పెంచాల్సి వచ్చిందని వెంబు తెలిపారు. 2021లో ప్రారంభమైన అరట్టై యాప్‌లో ఇప్పటికే వాయిస్, వీడియో కాల్స్‌కు ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ సౌకర్యం ఉంది. త్వరలో మెసేజ్‌లకు కూడా ఈ భద్రతను అందిస్తామని కంపెనీ తెలిపింది.

## 54 ప్రైవేటు వర్సిటీలకు యూజీసీ నోటీసులు

**వెబ్‌సైట్లలో తప్పనిసరి సమాచారాన్ని పెట్టకపోవడంపై ఆగ్రహం**

**పలుమార్లు హెచ్చరించినా స్పందించని యూనివర్సిటీలు**

**వెంటనే వివరాలు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా నిబంధనలు పాటించని ప్రైవేట్ యూనివర్సిటీలపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కఠిన చర్యలకు ఉపక్రమించింది. విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవసరమైన కీలక సమాచారాన్ని తమ వెబ్‌సైట్లలో బహిర్గతం చేయడంలో విఫలమైన 54 ప్రైవేట్ యూనివర్సిటీలకు తాజాగా నోటీసులు జారీ చేసింది. ఈ చర్య ఉన్నత విద్యారంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే దిశగా యూజీసీ తీసుకున్న కీలక నిర్ణయంగా భావిస్తున్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం, ప్రతి యూనివర్సిటీ తమ వద్ద అందుబాటులో ఉన్న కోర్సులు, ఫ్యాకల్టీ వివరాలు, విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతులు, ఆర్థిక వ్యవహారాల వంటి పూర్తి సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఎటువంటి లాగిన్ లేదా రిజిస్ట్రేషన్ అవసరం లేకుండా ఈ వివరాలను ఎవరైనా సులభంగా చూసే వీలు కల్పించాలి. అయితే, ఈ నిబంధనలను 54 వర్సిటీలు ఏమాత్రం పట్టించుకోలేదని యూజీసీ తన నోటీసులో స్పష్టం చేసింది. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు లేఖలు, ఈ-మెయిళ్ల ద్వారా హెచ్చరించడమే కాకుండా, ఆన్‌లైన్ సమావేశాల్లోనూ చర్చించినప్పటికీ ఆయా యూనివర్సిటీల నుంచి సరైన స్పందన రాలేదని యూజీసీ పేర్కొంది. ఈ నేపథ్యంలో, యూజీసీ కార్యదర్శి ప్రొఫెసర్ మనీశ్ జోషి ఈ 54 వర్సిటీలకు లేఖలు రాశారు. "విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కీలక నిర్ణయాలు తీసుకునే ముందు ఉన్నత విద్యా సంస్థల గురించి పూర్తి, ప్రామాణిక సమాచారాన్ని పొందే వీలుండాలి" అని ఆయన తన లేఖలో నొక్కిచెప్పారు. ఈ జాబితాలో గుజరాత్, హరియాణా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లోని ప్రైవేట్ యూనివర్సిటీలు ఉన్నాయి. కేవలం వెబ్‌సైట్‌లో వివరాలు అప్‌లోడ్ చేస్తే సరిపోదని, అదే సమాచారాన్ని పర్యవేక్షణ కోసం తమ కమిషన్‌కు కూడా సమర్పించాలని యూజీసీ తేల్చిచెప్పింది. ఈ చర్యల ద్వారా ఉన్నత విద్యాసంస్థల్లో జవాబుదారీతనం పెంచడంతో పాటు, ప్రజల్లో నమ్మకాన్ని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని యూజీసీ పునరుద్ఘాటించింది.

## ఆడాళ్ల లోదుస్తుల దొంగ!

బెంగళూరు: కర్ణాటకలోని హుబ్బళ్లి నగరంలో ఓ విచిత్ర ఘటన స్థానికంగా కలకలం రేపింది. మహిళల లోదుస్తులనే లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఓ యువకుడిని బెండిగేరి పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వికృత చేష్టలు తెలియడంతో స్థానిక మహిళలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే.. హుబ్బళ్లిలోని వీరాపుర ఓణి ప్రాంతంలో గత నెల రోజులుగా వింత సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇళ్లలో ఆరుబయట దండెంపై ఆరవేసిన మహిళల లోదుస్తులు తరచూ మాయమవుతున్నాయి. మొదట అందరూ గాలికి కొట్టుకుపోయి ఉంటాయని భావించారు. అయితే, ఇదే తంతు పదే పదే జరగడంతో స్థానికులకు అనుమానం వచ్చింది. దీంతో వారు తమ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ఆ ఫుటేజీలో కనిపించిన దృశ్యాలు చూసి స్థానికులు నిర్ఘాంతపోయారు. ఓ వ్యక్తి రాత్రిపూట ఇళ్ల బాల్కనీలు, టెర్రస్‌లపైకి ఎక్కి, ఆరవేసిన లోదుస్తులను దొంగిలించి ప్యాంటు జేబులో పెట్టుకుని వెళ్లడం స్పష్టంగా రికార్డయింది. బాధితుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు, నిందితుడిని తంతి నగర్‌కు చెందిన కార్తీక్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. అతను స్థానికంగా ఓ సౌండ్ సిస్టమ్ దుకాణంలో పనిచేస్తున్నట్లు తెలిపారు. పోలీసుల విచారణలో కార్తీక్ తన నేరాన్ని అంగీకరించాడు. దొంగిలించిన లోదుస్తులను సుమారు వారం రోజుల పాటు తన వద్దే ఉంచుకుని, ఆ తర్వాత తిరిగి ఆయా ఇళ్ల ఆవరణలోకి విసిరేస్తున్నట్లు చెప్పడం పోలీసులను సైతం ఆశ్చర్యపరిచింది. పదో తరగతి వరకు చదువుకున్న కార్తీక్ మానసికంగా వికృత ప్రవర్తనతో ఇలా చేస్తున్నాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనతో తీవ్ర ఆందోళనకు గురైన మహిళలు, నిందితుడి చర్యలు ఒకప్పటి కరడుగట్టిన సైకో కిల్లర్ ఉమేశ్ రెడ్డిని గుర్తు చేస్తున్నాయని అంటున్నారు. ఈ కేసుపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## ఆన్‌లైన్‌లో శబరిమల ప్రసాదం

శబరిమల: అయ్యప్ప స్వామి భక్తులకు శబరిమల ఆలయ కమిటీ శుభవార్త తెలిపింది. శబరిమల వరకూ రాలేని భక్తులు తమ ఇంటి వద్దకే స్వామి వారి ప్రసాదాన్ని తెప్పించుకునే వీలు కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఆన్ లైన్ లో ఆర్డర్ చేస్తే స్వామి వారి ప్రసాదాన్ని ఇంటికే పంపిస్తామని తెలిపింది. మరొక నెల రోజుల్లో ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని ట్రావెన్‌కూర్ దేవస్వోం బోర్డు ప్రకటించింది. కౌంటర్ బిల్లింగ్ మాడ్యూల్ సాయంతో ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు వెల్లడించింది. శబరిమలతో పాటు ట్రావెన్‌కూర్ సంస్థానం పరిధిలోని 1,252 దేవాలయాల ప్రసాదాలను కూడా ఆన్ లైన్ లో ఆర్డర్ చేసే సదుపాయాన్ని త్వరలో భక్తులకు అందుబాటులోకి తెస్తామని పేర్కొంది. శబరిమల లాంటి దేవాలయాలకు నేరుగా వెళ్లలేని భక్తులకు ఈ సదుపాయం ఉపయోగకరంగా ఉంటుందని బోర్డు తెలిపింది. కౌంటర్ బిల్లింగ్ మాడ్యూల్ ఒక నెలలోపు పనిచేయడం ప్రారంభిస్తుందని ఈ సందర్భంగా దేవస్వోం బోర్డు అధ్యక్షుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఒక్క ఫ్లాట్ ధర 500 కోట్లు

**సన్‌టెక్ రియాల్టీ సంచలనం!**

గురుగ్రామ్/ముంబై: రియల్ ఎస్టేట్ రంగంలో సరికొత్త సంచలనం నమోదైంది. దేశంలోని ప్రముఖ రియల్టీ సంస్థ సన్‌టెక్ రియాల్టీ లిమిటెడ్, అల్ట్రా లగ్జరీ హౌసింగ్ విభాగంలోకి అడుగుపెడుతూ అందరినీ ఆశ్చర్యపరిచింది. అత్యంత సంపన్న వర్గాలను లక్ష్యంగా చేసుకొని ఒక్కో ఫ్లాట్‌ను ఏకంగా రూ. 100 కోట్ల నుంచి రూ. 500 కోట్ల ధరతో విక్రయించనున్నట్లు ప్రకటించింది. గతంలో గురుగ్రామ్‌లో ఓ ఫ్లాట్ రూ. 100 కోట్లకు అమ్ముడుపోవడం వార్త కాగా, ఇప్పుడు సన్‌టెక్ ఆ రికార్డును బద్దలుకొట్టేందుకు సిద్ధమైంది. ఈ అత్యంత ఖరీదైన ప్రాజెక్టుల కోసం సన్‌టెక్ రియాల్టీ 'ఎమాన్సే' అనే సరికొత్త బ్రాండ్‌ను పరిచయం చేసింది. ఈ బ్రాండ్ కింద నిర్మించే ఇళ్లను కేవలం ఆహ్వానం (బై ఇన్విటేషన్ ఓన్లీ) ద్వారా మాత్రమే విక్రయిస్తామని కంపెనీ స్పష్టం చేసింది. తమ ఫ్లాట్ల కనీస ధర రూ. 100 కోట్లుగా ఉంటుందని, గరిష్ఠంగా రూ. 500 కోట్ల వరకు పలుకుతుందని సన్‌టెక్ రియాల్టీ సీఎండీ కమల్ ఖేతన్ తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను ముంబై, దుబాయ్‌లలో నిర్మించనున్నారు. ముంబైలోని నేపెన్సీ రోడ్‌తో పాటు, దుబాయ్ డౌన్‌టౌన్, బుర్జ్ ఖలీఫా కమ్యూనిటీలో ఈ నిర్మాణాలు చేపట్టనున్నారు. సన్‌టెక్ రియాల్టీకి ఇదే తొలి విదేశీ ప్రాజెక్ట్ కావడం గమనార్హం. దుబాయ్ ప్రాజెక్టు పనులను 2026 జూన్ నాటికి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా దాదాపు రూ. 20 వేల కోట్ల ఆదాయాన్ని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టులలో చదరపు అడుగు నిర్మాణ వ్యయమే రూ. 2.5 లక్షలకు పైగా ఉంటుందని అంచనా. దీంతో ఇవి దేశంలోనే అత్యంత ఖరీదైన నివాస ప్రాజెక్టులలో ఒకటిగా నిలవనున్నాయి. సన్‌టెక్ రియాల్టీ సుమారు 52.5 మిలియన్ చదరపు అడుగుల పోర్ట్‌ఫోలియోతో దేశంలోని అగ్రగామి రియల్టర్లలో ఒకటిగా కొనసాగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కంపెనీ నికర లాభం 47 శాతం పెరిగి రూ. 33.43 కోట్లకు చేరింది. అయితే, ఆదాయం రూ. 328 కోట్ల నుంచి రూ. 201 కోట్లకు తగ్గింది.

## ఖతార్ ప్రధానికి సారీ చెప్పిన నెతన్యాహు

న్యూయార్క్: ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు ఖతార్ ప్రధానికి ఫోన్ చేసి క్షమాపణ చెప్పారు. అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ నుంచే నెతన్యాహు ఈ ఫోన్ కాల్ చేయడం గమనార్హం. ఖతార్ రాజధాని దోహాపై ఇటీవల ఇజ్రాయెల్ సైన్యం జరిపిన వైమానిక దాడిపట్ల నెతన్యాహు విచారం వ్యక్తం చేసినట్లు వైట్ హౌస్ వర్గాలు తెలిపాయి. గాజా యుద్ధం, హమాస్ తో కాల్పుల విరమణకు సంబంధించి అమెరికా అధ్యక్షుడితో చర్చించేందుకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వాషింగ్టన్ వెళ్లారు. సోమవారం వైట్ హౌస్ లో నెతన్యాహుతో ట్రంప్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దోహాపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడి విషయాన్ని ట్రంప్ ప్రస్తావించారని, ఓవైపు శాంతి చర్చలు జరుపుతుండగా దాడి ఎలా చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం. ఖతార్ తమకు మంచి మిత్రుడని ట్రంప్ తరచుగా మీడియా ముందు వ్యాఖ్యానించడం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే నెతన్యాహుపై ఒత్తిడి తెచ్చి ఖతార్ ప్రధాని షేక్ మొహమ్మద్ బిన్ అబ్దుల్ రెహ్మాన్ అల్ థానికి ఫోన్ చేయించారని, దోహా దాడికి క్షమాపణ చెప్పించారని వైట్ హౌస్ ఓ ప్రకటనలో తెలిపింది. ఖతార్ కూడా ఈ ఫోన్ కాల్ నిజమేనని నిర్ధారించింది.

## ఇండియాకు కీలక ప్రాజెక్టులు
# అమెరికాలో హెచ్-1బీ వీసా దెబ్బ ప్రభావం

**భారత్ వైపు చూస్తున్న అమెరికా టెక్ కంపెనీలు**




న్యూఢిల్లీ/న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న కఠినమైన హెచ్-1బీ వీసా నిర్ణయాలు, భారత టెక్ రంగానికి పరోక్షంగా మేలు చేసేలా కనిపిస్తున్నాయి. వీసా నిబంధనలను కఠినతరం చేస్తుండటంతో, అమెరికన్ కంపెనీలు తమ కీలకమైన ప్రాజెక్టులను, ఉన్నత స్థాయి పనులను భారత్‌లోని తమ కార్యాలయాలకు తరలించేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ పరిణామం దేశంలోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) అభివృద్ధికి మరింత ఊతమిస్తుందని ఆర్థిక నిపుణులు, పారిశ్రామిక వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇటీవల ట్రంప్ సర్కార్ కొత్త హెచ్-1బీ వీసా దరఖాస్తు ఫీజును ప్రస్తుతం ఉన్న 2,000-5,000 డాలర్ల నుంచి ఏకంగా లక్ష డాలర్లకు పెంచింది. దీనికి తోడు, సోమవారం కొందరు యూఎస్ సెనేటర్లు హెచ్-1బీ, ఎల్-1 వీసా ప్రోగ్రామ్‌లలోని లోపాలను సరిదిద్దేందుకు ఓ కొత్త బిల్లును కూడా ప్రవేశపెట్టారు. ఈ పరిణామాలతో అమెరికాలో విదేశీ నిపుణులను నియమించుకోవడం కంపెనీలకు మరింత వ్యయభరితంగా, సంక్లిష్టంగా మారింది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించిన సంస్థలు, భారత్‌లోని తమ జీసీసీలను ఆశ్రయిస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న జీసీసీలలో సగానికి పైగా, అంటే దాదాపు 1,700 సెంటర్లు ఒక్క భారత్‌లోనే ఉన్నాయి. ఇవి కేవలం టెక్ సపోర్ట్ కేంద్రాలుగా మాత్రమే కాకుండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ప్రాడక్ట్ డెవలప్‌మెంట్, సైబర్‌సెక్యూరిటీ, అనలిటిక్స్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ వంటి అత్యంత కీలకమైన విభాగాల్లోనూ పనిచేస్తున్నాయి. ఈ విషయంపై డెలాయిట్ ఇండియా భాగస్వామి రోహన్ లోబో మాట్లాడుతూ, "ఈ సమయంలో జీసీసీలు చాలా కీలక పాత్ర పోషించనున్నాయి. ఇప్పటికే పలు అమెరికన్ కంపెనీలు తమ వర్క్‌ఫోర్స్ వ్యూహాలను పునఃసమీక్షిస్తున్నాయి. ముఖ్యంగా ఫైనాన్షియల్ సర్వీసులు, టెక్నాలజీ రంగాల్లో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది" అని వివరించారు. అనేక కంపెనీలకు జీసీసీలను ఏర్పాటు చేయడంలో సహాయపడిన ఏఎన్ఎస్ఆర్ వ్యవస్థాపకుడు లలిత్ అహూజా కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "ఈ మార్పుపై కంపెనీల మధ్య తీవ్రమైన చర్చ జరుగుతోంది. త్వరగా నిర్ణయాలు తీసుకోవాలనే ఆత్రుత కనిపిస్తోంది" అని ఆయన తెలిపారు. నిపుణుల అంచనా ప్రకారం, వీసా నిబంధనలు ఇలాగే కొనసాగితే, అమెరికాలోని వ్యూహాత్మక ఉద్యోగాలు సైతం భారత్‌కు తరలిరావడం ఖాయంగా కనిపిస్తోంది.

## అమెరికాలో లక్ష ఉద్యోగులు ఇంటికే!

**ట్రంప్ ప్రభుత్వంలో పెను సంక్షోభం**

**ట్రంప్ తెచ్చిన 'డీఆర్‌పీ' వల్లే ఈ పరిస్థితి**

వాషింగ్టన్: అమెరికా ప్రభుత్వ యంత్రాంగం చరిత్రలోనే కనీవినీ ఎరుగని సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. డొనాల్డ్ ట్రంప్ పాలన తీసుకున్న సంచలన నిర్ణయాల ఫలితంగా సెప్టెంబర్ 30 నుంచి ఏకంగా లక్ష మంది ఫెడరల్ ఉద్యోగులు తమ విధులకు దూరం అవుతున్నారు. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద సామూహిక నిష్క్రమణగా నిపుణులు దీనిని అభివర్ణిస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఈ సంఖ్య 3 లక్షలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఇది రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఒకే ఏడాదిలో ఇంత పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు వైదొలగడం ఇదే మొదటిసారి. ట్రంప్ ప్రభుత్వం 'డిఫర్డ్ రెసిగ్నేషన్ ప్రోగ్రామ్' (డీఆర్‌పీ) పేరుతో ఒక ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని ప్రకారం, ఉద్యోగులు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తే సెప్టెంబర్ 30 వరకు ఎలాంటి పని చేయకుండానే పూర్తి జీతభత్యాలు పొందే అవకాశం కల్పించింది. దీనికి తోడు కొత్త నియామకాలపై నిషేధం, అనవసరమైన ఉద్యోగుల తొలగింపు వంటి చర్యలు చేపట్టడంతో చాలా మంది ఉద్యోగులు ఒత్తిడితో రాజీనామా బాట పట్టారు. ప్రభుత్వ సామర్థ్యాన్ని పెంచేందుకే ఈ సంస్కరణలు అని ట్రంప్ సర్కార్ సమర్థించుకుంటుండగా, ఇది ప్రభుత్వ వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనని విమర్శకులు ఆరోపిస్తున్నారు. ఈ విధానాలను సవాలు చేస్తూ ఉద్యోగ సంఘాలు కోర్టును ఆశ్రయించినా, సుప్రీంకోర్టు 8-1 తేడాతో ప్రభుత్వ చర్యలను సమర్థించడం గమనార్హం. ఈ సంస్కరణల అమలు కోసం ఎలాన్ మస్క్ నేతృత్వంలో 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ' (డాగ్) అనే కొత్త విభాగాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ సామూహిక రాజీనామాల ప్రభావం ఇప్పటికే ప్రభుత్వ సేవలపై స్పష్టంగా కనిపిస్తోంది. పన్నుల వసూలు సంస్థ ఐఆర్ఎస్‌లో 25 శాతం సిబ్బంది తగ్గడంతో వచ్చే ఏడాది పన్నుల సీజన్‌లో తీవ్ర జాప్యం తప్పదని ఆందోళన వ్యక్తమవుతోంది.




## ట్రంప్‌తో యూట్యూబ్ రాజీ

**రూ.204 కోట్లతో దావా పరిష్కారం**

వాషింగ్టన్: టెక్నాలజీ దిగ్గజం గూగుల్‌కు చెందిన యూట్యూబ్.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తన వివాదాన్ని పరిష్కరించుకుంది. 2021లో ట్రంప్ ఖాతాను సస్పెండ్ చేసినందుకు గాను ఆయన దాఖలు చేసిన దావాను సెటిల్ చేసుకునేందుకు గూగుల్ ముందుకొచ్చింది. ఈ ఒప్పందంలో భాగంగా 24.5 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 204 కోట్లు) చెల్లించడానికి అంగీకరించింది. ఈ మేరకు కాలిఫోర్నియా ఫెడరల్ కోర్టులో పత్రాలు దాఖలయ్యాయి. 2021 జనవరి 6న యూఎస్ క్యాపిటల్‌పై జరిగిన దాడి తర్వాత హింసను ప్రేరేపించే ప్రమాదం ఉందన్న కారణంతో యూట్యూబ్ సహా పలు సోషల్ మీడియా సంస్థలు ట్రంప్ ఖాతాలను నిలిపివేసిన విషయం తెలిసిందే. దీనిపై ట్రంప్ న్యాయపోరాటం ప్రారంభించారు. తాజాగా గూగుల్‌తో కుదిరిన ఒప్పందం ప్రకారం సెటిల్మెంట్ మొత్తంలోని 22 మిలియన్ డాలర్లను 'ట్రస్ట్ ఫర్ ది నేషనల్ మాల్' అనే స్వచ్ఛంద సంస్థకు విరాళంగా ఇవ్వనున్నారు. మిగిలిన మొత్తాన్ని ఈ కేసులోని ఇతర పిటిషనర్లు అయిన 'అమెరికన్ కన్జర్వేటివ్ యూనియన్' వంటి సంస్థలకు చెల్లిస్తారు. అయితే, ఈ సెటిల్మెంట్ అనేది తమ వైపు నుంచి తప్పును అంగీకరించినట్లు కాదని ఒప్పంద పత్రాల్లో గూగుల్ స్పష్టంగా పేర్కొంది. ఈ ఒప్పందం విషయాన్ని గూగుల్ ధ్రువీకరించినప్పటికీ, దీనిపై అదనపు వ్యాఖ్యలు చేయడానికి నిరాకరించింది. అక్టోబర్ 6న ఓక్లాండ్‌లోని కోర్టులో ఈ కేసుపై విచారణ జరగాల్సి ఉండగా, సరిగ్గా వారం రోజుల ముందే ఇరు పక్షాల మధ్య రాజీ కుదరడం గమనార్హం.

## లండన్‌లో గాంధీ విగ్రహం ధ్వంసం

లండన్: మహాత్మాగాంధీ జయంతి వేడుకలకు ప్రపంచం సిద్ధమవుతున్న వేళ, లండన్‌లో ఆయన విగ్రహానికి ఘోర అవమానం జరిగింది. నగరంలోని ప్రఖ్యాత టవిస్టాక్ స్క్వేర్‌లో ఉన్న గాంధీ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం ధ్వంసం చేశారు. అక్టోబర్ 2న జరగనున్న గాంధీ జయంతి ఉత్సవాలకు కొన్ని రోజుల ముందు ఈ ఘటన చోటుచేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. ఈ దుశ్చర్యను లండన్‌లోని భారత హైకమిషన్ తీవ్రంగా ఖండించింది. ఇది సిగ్గుచేటైన చర్య అని, అహింసా సిద్ధాంతంపై జరిగిన దాడి అని అభివర్ణించింది. ధ్యానముద్రలో కూర్చుని ఉన్న గాంధీ విగ్రహం పీఠంపై దుండగులు భారత వ్యతిరేక రాతలు రాశారు. ఈ ఘటనపై భారత హైకమిషన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. "ఇది కేవలం విగ్రహాన్ని ధ్వంసం చేయడం కాదు, అంతర్జాతీయ అహింసా దినోత్సవానికి మూడు రోజుల ముందు అహింసా వారసత్వంపై జరిగిన హింసాత్మక దాడి. ఈ విషయాన్ని స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. విగ్రహాన్ని తిరిగి పూర్వ వైభవానికి తీసుకురావడానికి మా బృందం ఇప్పటికే అధికారులతో కలిసి పనిచేస్తోంది" అని హైకమిషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. విగ్రహ పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న మెట్రోపాలిటన్ పోలీసులు, స్థానిక కామ్డెన్ కౌన్సిల్ అధికారులు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

## వయ్యారి చిత్రం



## సుధీర్ బాబు 'జటాధర'.. 'ధన పిశాచి' ఉగ్రరూపం



టాలీవుడ్ నవ దళపతి సుధీర్ బాబు ఇప్పుడు జటాధర మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్నారు. ఇటీవల సినిమా నుంచి 'సోల్ ఆఫ్ జటాధర' అనే థీమ్ సాంగ్ ను కూడా మేకర్స్ విడుదల చేయగా.. అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. 'ఓం నమః శివాయ' మంత్రంతో సాగే ఆ పాట.. సినిమాలోని ఆధ్యాత్మిక భావనను తెలియజేస్తూ ప్రేక్షకులను తెగ ఆకట్టుకుంది. తాజాగా దసరా పండుగను పురస్కరించుకుని మరో పాటను తాజాగా తీసుకొచ్చారు మేకర్స్. సినిమా నుంచి 'ధన పిశాచి' అనే మరో కొత్త పాటను విడుదల చేశారు. అందులో బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా కనిపించారు. నెవ్వర్ బిఫోర్ అనేలా ఉగ్రరూపంలో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారని చెప్పాలి. సాంగ్‌లో తన ఎక్స్ప్రెషన్స్ తో అందరినీ ఫిదా చేస్తున్నారు.

## ఐటమ్ సాంగ్స్ వల్లే పాపులారిటీ: తమన్నా

18 ఏళ్ల సినీ కెరీర్‌లో ఇంత స్టార్ స్టేటస్ రావటానికి కారణం సినిమాలు కాదని, స్పెషల్ సాంగ్స్ అని చెప్పింది తమన్నా. ఒకవైపు సినిమాలు , వెబ్ సిరీస్ లు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న అవకాశం వస్తే స్పెషల్ సాంగ్స్ లలో కూడా చేస్తూ ఆకట్టుకుంటోంది. ఈ క్రమంలోని ఇటీవల ఈమె చేసిన ఒక స్పెషల్ సాంగ్ భారీగా సక్సెస్ అవ్వడంతో తమన్నా పేరు మరోసారి గట్టిగా వినిపిస్తోంది. ఈ క్రమంలోనే ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న తమన్న ఎన్నో ఆసక్తికర విషయాలు పంచుకుంది. తమన్నా మాట్లాడుతూ.. 'నేను ఇప్పటికే ఎన్నో తెలుగు, తమిళ్, హిందీ సినిమాలలో నటించాను. అయితే ఆ చిత్రలేవీ కూడా నాకు మంచి గుర్తింపుని అందివ్వలేదు. కానీ ఎప్పుడైతే తెలుగులో అల్లు అర్జున్‌తో బద్రీనాథ్ సినిమా చేశానో.. ఆ సినిమాలో చేసిన ఐటమ్ సాంగ్‌కు భారీ గుర్తింపు వచ్చింది. అప్పటినుంచి చాలామంది దర్శక నిర్మాతలు స్పెషల్ సాంగ్స్ కోసమే నన్ను సంప్రదించేవారు. అలా అప్పటినుంచి టాలీవుడ్ తో పాటు బాలీవుడ్ అలాగే ఇతర సౌత్ చిత్రాలలో కూడా నేను స్పెషల్ సాంగ్స్ చేస్తున్నాను. ఒకరకంగా చెప్పాలి అంటే ఇన్నేళ్ల కెరీర్‌లో నాకు మంచి సక్సెస్ ఇచ్చింది మాత్రం స్పెషల్ సాంగ్సే' అని పేర్కొంది.




## అప్పుడు ఆఫీస్ బాయ్.. ఇప్పుడు స్టార్ హీరో




రిషబ్ శెట్టి 2022 కాంతారా రిలీజ్ ముందు వరకు అతనొక కన్నడ హీరో కం డైరెక్టర్ మాత్రమే. కానీ ఎప్పుడైతే కాంతారా రిలీజైందో అప్పటి నుంచి అతను పాన్ ఇండియా స్టార్ గా మారాడు. కాంతార సినిమా ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఆ సినిమాను రిషబ్ శెట్టి నటించడమే కాకుండా డైరెక్ట్ చేశారు. సినిమాలో ఆయన పర్ఫార్మెన్స్ కి బెస్ట్ యాక్టర్ గా నేషనల్ అవార్డ్ కూడా వచ్చింది. కాంతారా పై ఉన్న క్రేజ్ ని దృష్టిలో ఉంచుకుని కాంతారా చాప్టర్ 1 అంటూ మరో సినిమా చేశాడు రిషబ్ శెట్టి. ఐతే ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ముంబై ప్రెస్ మీట్ లో పాల్గొన్నాడు రిషబ్ శెట్టి. ముంబై తనకు చాలా నచ్చుతుందని ఎందుకంటే 2008లో తాను ఇక్కడ ఒక ప్రొడక్షన్ కంపెనీలో ఆఫీస్ బాయ్ గా చేశానని రిషబ్ శెట్టి చెప్పారు. అంధేరి వెస్ట్ సైడ్ లో ఒక ప్రొడక్షన్ లో తాను ఆఫీస్ బాయ్, ప్రొడ్యూసర్‌కి డ్రైవర్ గా చేశానని సినిమా అనేది గాడ్ అని ఇక్కడ ఏదైనా జరుగుతుందని అన్నారు రిషబ్ శెట్టి.

## దీపికను వెంటాడుతున్న 8 గంటలు

భారతదేశంలో బిగ్గెస్ట్ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సరసన అవకాశం కోసం ఎదురు చూడని కథానాయిక లేదు. అలాంటి అగ్ర కథానాయకుడితో బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటించే అవకాశాలు వచ్చినా దీపిక పదుకొనే వాటిని తన అవివేకంతో కాలదన్నుకుందని విమర్శలొస్తున్నాయి. ఎనిమిది గంటల పనిదినం కుదరదు.. బిడ్డ తల్లికి 6 గంటలు మాత్రమే అనుకూలం! అని కండీషన్ పెట్టడంతో ప్రభాస్ తో స్పిరిట్, కల్కి 2898 ఏడీ సినిమాల నుంచి అవకాశాల్ని కోల్పోయింది. రెండు పెద్ద సినిమాల నుంచి తొలగించగానే దీపిక పదుకొనే గురించి అన్ని సినీపరిశ్రమల్లో విస్తృతంగా చర్చ సాగింది. ఇప్పుడు ఈ ఎఫెక్ట్ హిందీ చిత్రసీమలోను పని చేస్తోందని గుసగుస వినిపిస్తోంది. ముఖ్యంగా బాలీవుడ్ అగ్ర దర్శకురాలు, ప్రముఖ కొరియోగ్రాఫర్ ఫరాఖాన్ తో దీపిక పదుకొనేకు చెడిందని గుసగుస వినిపిస్తోంది. దీపికా పదుకొనే, ఫరా ఖాన్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో చేయడంతో బాలీవుడ్ లో పెద్ద చర్చగా మారింది. ఫరా దర్శకత్వం వహించిన ఓం శాంతి ఓం చిత్రంతో దీపిక పరిచయమైంది.





## పారిస్ ఫ్యాషన్ వీక్‌లో ఐశ్వర్యరాయ్

మాజీ విశ్వసుందరి ఐశ్వర్యారాయ్ ఎప్పటికప్పుడు తన ఫ్యాషన్ సెన్స్ తో.. తన పనులతో భారతీయ సంస్కృతిని అంతర్జాతీయ వేదికపై ప్రదర్శిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మొన్నామధ్య కేన్స్ ఫిలిం ఫెస్టివల్ లో సందడి చేసింది.. హిందూ సాంప్రదాయం ప్రకారం నుదుటిన పెద్ద సింధూరం బొట్టు ధరించి భారతీయ సంప్రదాయాన్ని ప్రదర్శించిన ఐశ్వర్యరాయ్ ఇప్పుడు మరొకసారి 'నమస్తే' అంటూ అందరిని పలకరించింది. అలా తన వస్త్రధారణతోనే కాదు తన ప్రవర్తనతో కూడా ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తోంది ఐశ్వర్యరాయ్. అసలు విషయంలోకి వెళ్తే.. తాజాగా పారిస్ ఫ్యాషన్ వీక్ 2025 లో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది.



## హీరోయిన్‌ను చీట్ చేసిన టీచర్లు!

మాలీవుడ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ ఇటీవలే కిష్కిందపురితో విజయాన్ని అందుకుంది. త్వరలో బైసన్ తో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతోంది. ఈ సందర్భంగా స్కూల్లో టీచర్లు తనను ఎలా మోసం చేసారో గుర్తు చేసుకుంది. అనుపమకు చిన్న నాటి నుంచి నటనంటే ఆసక్తి. కానీ స్కూల్ టాపర్స్ కి మాత్రమే సినిమాల్లో అవకాశాలు వస్తాయి. అని తన టీచర్లు చెప్పేవారట. బాగా చదివిన వాళ్లకే డైలాగులు చెప్పడం వస్తుందని..వాళ్లు మాత్రమే సినిమాల్లో రాణిస్తారని చెప్పేవారట. ఆ మాటలను అనుపమ మనసులో ఆ వయసులోనే బలంగా వెళ్లిపోయాయి. కానీ అనుపమ చదువులో వీక్. దీంతో తాను నటిగా పనికిరానని ఆ వయసులోనే నిర్ణయించుకుందట. కానీ కాస్త ఊహ తెలిసాకే అసలు సత్యం బోధపడింది. నటనకు..చదువుకు ఎంత మాత్రం సంబంధం లేదని గ్రహించినట్లు తెలిపింది. ఇంకా చెప్పాలంటే సరిగ్గా చదువురాని వాళ్లే సినిమాల్లో ఉంటారని ఇంకాస్త క్లారిటీ వచ్చిందని చెప్పింది.



## ఆ క్రెడిట్ రోహిత్ భార్యదే: సూర్యకుమార్ యాదవ్



ఆసియా కప్ 2025 టోర్నీలో తాను ప్రశాంతంగా కెప్టెన్సీ చేయడానికి ప్రధాన కారణం మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ సతమణి రితికా సజ్దేనని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. ఆమె చెప్పిన సలహా పాటించడంతోనే తాను భావోద్వేగాలను అదుపు చేసుకొని ప్రశాంతంగా తన పని తాను చేసుకున్నానని తెలిపాడు. సోమవారం స్వదేశం చేరిన సూర్య.. ఓ జాతీయ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని రితికా సజ్దే చెప్పిన సలహాను పాటించడంతోనే తాను ప్రశాంతంగా కెప్టెన్సీ చేయగలిగానని చెప్పాడు. ప్రధాన టోర్నీలకు ముందు రోహిత్ శర్మ ఇలానే చేసేవాడని, సోషల్ మీడియా యాప్స్‌ను తొలగించేవాడని రితిక చెప్పిందని సూర్య పేర్కొన్నాడు. తాను కూడా అదే ఫాలోవుతున్నానని తెలిపాడు. 'ఆసియా కప్ ఆడేందుకు దుబాయ్ రావడానికి ముందే నా మొబైల్‌లో ఉన్న సోషల్ మీడియా యాప్స్ ఇన్‌స్టా, ట్విటర్, ఫేస్‌బుక్‌ను తొలగించాను. కమ్యూనికేషన్ కోసం వాట్సాప్ మాత్రమే ఉపయోగించాను. మొబైల్‌లో సోషల్ మీడియా యాప్స్ ఉంటే అందులో వచ్చే మెసేజ్‌లు అన్ని చూడాలనిపిస్తోంది. మెగా టోర్నీలు ఆడటానికి ముందు రోహిత్ శర్మ సోషల్ మీడియాకు దూరంగా ఉంటాడని రితిక సజ్దే చెప్పిన విషయం నాకు బాగా గుర్తుంది. రోహిత్ యాప్స్ అన్ని తొలగించేవాడని పేర్కొంది. నేను అదే ఫాలోయ్యాను. దీని వల్ల నాకు మంచి జరిగింది' అని సూర్యకుమార్ యాదవ్ చెప్పుకొచ్చాడు.




# సూటి పోటి మాటలతో రెచ్చగొట్టినా!

### దేశమే ముఖ్యమని నా ఆట నేను ఆడా: తిలక్ వర్మ


ఆసియా కప్ 2025 ఫైనల్లో పాకిస్థాన్ ఆటగాళ్లు కవ్వింపులకు పాల్పడ్డారని, సూటి పోటీ మాటలతో రెచ్చగొట్టారని టీమిండియా స్టార్ బ్యాటర్, తెలుగు తేజం తిలక్ వర్మ అన్నాడు. ఆ మాటలకు సహనం కోల్పోకుండా బ్యాట్‌తో సమాధానం ఇవ్వాలనుకున్నానని, అలానే చేశానని తెలిపాడు. విజయం తర్వాత పాకిస్థాన్ ఆటగాళ్లు ముఖం చాటేసారని, తనకు ఎదురపడలేదని పేర్కొన్నాడు. గత ఆదివారం ఉత్కంఠగా సాగిన ఫైనల్లో టీమిండియా 5 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో తిలక్ వర్మ అజేయ హాఫ్ సెంచరీతో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. సోమవారం స్వదేశం చేరుకున్న తిలక్ వర్మకు హైదరాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ ఇంద్ర సేనారెడ్డి, ఎండీ సోనీ బాలా దేవి తిలక్ వర్మను కలిసి అభినందనలు తెలిపారు. విమానాశ్రయం నుంచి నేరుగా ఇంటికి వెళ్లిపోయిన తిలక్.. మంగళవారం తన క్రికెట్ అకాడమీ(లీగాలా క్రికెట్ అకాడమీ)ని సందర్శించాడు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన తిలక్ వర్మ ఫైనల్‌కు సంబంధించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'ఫైనల్లో నేను క్రీజులోకి వచ్చే సమయానికి మూడు వికెట్లు పడ్డాయి. తీవ్ర ఒత్తిడి ఉంది. ఆ సమయంలో పాకిస్థాన్ ఆటగాళ్లు సూటి పోటీ మాటలతో కవ్వింపులకు పాల్పడ్డారు. ముఖ్యంగా పాకిస్థాన్ వికెట్ కీపర మహమ్మద్ హరిస్ వెనుకాల నుంచి స్లెడ్జింగ్‌కు దిగాడు. ఇది ఐపీఎల్ కాదని, ముంబై కాదని ఎద్దేవా చేశాడు. ఆ మాటలకు కోపం వచ్చింది. కానీ ఆ సమయంలో నాకు దేశమే గుర్తొచ్చింది. ఓడితే దేశం తక్కువ అవుతుందని నన్ను నేను బ్యాక్ చేసుకున్నాను. వారి మాటలకు బ్యాట్‌తోనే సమాధానం చెప్పాలని నిర్ణయించుకున్నా. అనుకున్నట్లుగానే చెలరేగిపోయా. స్టేడియంలో అభిమానులు వందేమాతరంతో హోరెత్తించడంతో మరింత కసిగా చెలరేగిపోయా. నా ఆట తర్వాత మైదానంలో పాకిస్థాన్ ఆటగాళ్లు ఎవరూ కనిపించలేదు. మరో మాట అనే అవకాశం వారికి లేకుండా పోయింది. నేను ఆడిన ఇన్నింగ్స్‌ల్లో ఇదే అత్యుత్తమైన ఇన్నింగ్స్. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకస్థాన్ ఆటగాళ్లు కొంత దూకుడుగా వచ్చారు. క్రీడలను ఎమోషన్స్‌తో ఆడితే కష్టం. ఆటను ఆటలా ఆడి వారికి మంచి రిప్లై ఇచ్చాం. చిన్నప్పటి నుంచి విరాట్ కోహ్లీ ఆటను చూస్తూ పెరిగాను. అతనితో నన్ను పోల్చడం గర్వంగా ఉంది. వచ్చే ప్రపంచకప్‌లో భారత్‌ను గెలిపించడమే నా లక్ష్యం.'అని తిలక్ వర్మ చెప్పుకొచ్చాడు.

## గంభీర్ 'గ్యాంగ్‌స్టర్' మోడ్

ఆసియా కప్ 2025 ఫైనల్లో టీమిండియా ఘన విజయం సాధించినప్పటికీ.. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ రియాక్షన్, స్టేడియంలో ఆటగాళ్ల మధ్య జరిగిన ఘర్షణలు ఎక్కువగా చర్చకు వచ్చాయి. ముఖ్యంగా పాక్ పేసర్ హారిస్ రౌఫ్‌పై టీమిండియా కోచ్ గౌతమ్ గంభీర్ తీవ్ర



ఆగ్రహంతో కనిపించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరలవుతోంది. ఆసియా కప్ 2025 ఫైనల్లో పాకిస్తాన్ జట్టును 5 వికెట్ల తేడాతో ఓడించి టీమిండియా 9వ సారి టైటిల్ ను కైవసం చేసుకుంది. ఈ విజయంలో తిలక్ వర్మ(60లి) కీలక పాత్ర పోషించాడు. అయితే అందరి దృష్టిని ఆకర్షించింది మాత్రం హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ రియాక్షన్. తిలక్ వర్మ ఫైనల్ ఓవర్లో హారిస్ రౌఫ్ బౌలింగ్‌లో కొట్టిన సిక్సర్‌కు గంభీర్ డగౌట్‌లో కూర్చొని ఆవేశంగా విజయాన్ని సెలబ్రేట్ చేసుకున్న దృశ్యం అభిమానులను ఆకట్టుకుంది. ఈ టోర్నమెంట్‌లో భారత్-పాకిస్తాన్‌లు మూడుసార్లు తలపడ్డాయి. సూపర్ 4 దశలో జరిగిన మ్యాచ్‌లో రెండు జట్ల ఆటగాళ్ల మధ్య ఉద్రిక్తత చాలా పెరిగింది. ముఖ్యంగా పాకిస్తాన్ పేసర్ హారిస్ రౌఫ్, భారత బ్యాటర్ అభిషేక్ శర్మ మధ్య వాగ్వాదం జరిగింది. ఒకానొక సందర్భంలో ఇద్దరు ఆటగాళ్లు ఒకరినొకరు ఢీకొనడంతో అంపైర్లు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ఈ సంఘటన జరుగుతున్న సమయంలోనే గౌతమ్ గంభీర్ కూడా తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు డ్రెస్సింగ్ రూమ్ నుంచి ఓ వీడియో వైరల్ అయింది. గంభీర్ కోపంతో ఏదో అరుస్తూ.. నియంత్రించడం కష్టంగా కనిపించినట్లు ఆ వీడియోలో ఉంది.



## క్రికెట్‌లో రాజకీయమా?

### సూర్య తీరు సిగ్గుచేటు: సయ్యద్ కిర్మాణీ

టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై మాజీ క్రికెటర్ సయ్యద్ కిర్మాణీ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రికెట్‌లో రాజకీయాలు చేయడం ఏంటని మండిపడ్డారు. సూర్య, టీమిండియా వ్యవహరించిన తీరు సిగ్గు చేటని, ఓ క్రికెటర్‌గా తలదించుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసియా కప్‌లో భారత్ వ్యవహరించిన తీరుపైనా కిర్మాణీ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ప్రముఖ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. భారత జట్టు తీరును తప్పుబట్టాడు. క్రికెట్ జెంటిల్‌మెన్ గేమ్ అని, రాజకీయాలు చేయడం సరికాదని విమర్శించాడు. 'ప్రస్తుతం క్రికెట్ ఆడుతున్న తీరు ఏ మాత్రం నచ్చడం లేదు. నేను దేశాల పేర్లు చెప్పను కానీ, ఆటలో క్రీడాస్ఫూర్తి కనిపించడం లేదు. క్రికెట్ అంటే జెంటిల్‌మెన్ గేమ్. కానీ ఇప్పుడు ఆ ఆటను రాజకీయాలకు వేదికగా మార్చారు. మైదానంలో ఆటగాళ్ల ప్రవర్తన దారుణంగా ఉంది. అహంకారంతో కూడిన సంజ్ఞలు, ప్రత్యర్థుల పట్ల ద్వేషం, అమర్యాదగా ప్రవర్తించడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. నేను కేవలం ఆసియా కప్ ఫైనల్‌ను ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేయడం లేదు. నాకు చాలా మంది నుంచి సందేశాలు వస్తున్నాయి. భారత జట్టుకు ఏమైంది? మైదానంలో రాజకీయాలు ఏంటి? అని ప్రశ్నిస్తున్నారు. విదేశాల్లో ఉన్న నా స్నేహితుల మాటలు వినడానికి నాకు సిగ్గుగా ఉంది. సాధారణంగా క్రీడల్లో రాజకీయాలు చేయకూడదు. రాజకీయాలను పక్కన పెట్టాలి. క్రీడా మైదానానికి దూరంగా జరిగే విషయాలను అక్కడే వదిలేయాలి. ఈ గొప్ప క్రికెట్ గేమ్ నుంచి సంపాదిస్తున్న సొమ్మును ఆ రాజకీయాల కోసం ఖర్చు చేయవద్దు. వరద సాయం, లేదా ఇతర మంచి కార్యక్రమాల కోసం వెచ్చించవచ్చు. కానీ రాజకీయాలను ప్రేరపితం చేసేలా విరాళాలు ప్రకటించడం సరికాదు. ఈ వ్యవహారంపై మాట్లాడాలంటేనే సిగ్గుగా ఉంది. ఓ మాజీ క్రికెటర్‌గా నేను తల దించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది' అని పేర్కొన్నాడు.

## పాక్ క్రికెటర్లకు పీసీబీ షాక్

ఆసియా కప్ ఫైనల్‌లో భారత్ చేతిలో ఓటమి తర్వాత పాకిస్తాన్ ఆటగాళ్లకు పీసీబీ షాక్ ఇచ్చింది. ఆటగాళ్లకు ఇచ్చిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లను సస్పెండ్ చేసింది. దాంతో జాతీయ ఆటగాళ్లు ఇకపై ఏ విదేశీ టీ20 లీగ్, ఫ్రాంచైజీ తరఫున ఆడేందుకు అనుమతి ఉండదు. పీసీబీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సయ్యద్ సమీర్ అహ్మద్ ఆటగాళ్లు విదేశీ లీగ్‌లకు బదులుగా దేశీయ క్రికెట్, అంతర్జాతీయ మ్యాచ్‌లపై దృష్టి పెట్టాలని సూచించారు. పీసీబీ నిర్ణయంతో పాకిస్తాన్ అగ్రశ్రేణి క్రికెటర్లను ప్రభావితం చేస్తుంది. ఈ సంవత్సరం ఆస్ట్రేలియా బిగ్ బాష్ లీగ్ లో బాబర్ ఆజం, షాహీన్ షా అఫ్రిది, మహ్మద్ రిజ్వాన్, ఫహీమ్ అష్రఫ్, షాదాబ్ ఖాన్ పాల్గొనాల్సి ఉంది. హారిస్ రౌఫ్‌తో పాటు ఇతర ఆటగాళ్లు ఐఎల్ టీ20 లీగ్‌లో పాల్గొనాల్సి ఉంది. అయితే, ఎన్‌వోసీలను సస్పెన్షన్‌కు కారణాలను పీబీసీ వెల్లడించలేదని.. ఆసియా కప్‌లో జట్టు పేలవ ప్రదర్శనతో బోర్డు తక్షణ ప్రతిచర్యలు తీసుకున్నట్లుగా క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.




## వరల్డ్ కప్ భారత వుమెన్స్ క్రికెట్‌కు టర్నింగ్ పాయింట్ : సచిన్



ఐసీసీ వన్డే వరల్డ్ కప్ భారత వుమెన్స్ క్రికెట్‌కు ఓ టర్నింగ్ పాయింట్ కాగలదని టీమిండియా లెజెండ్ సచిన్ టెండూల్కర్ అభిప్రాయపడ్డాడు. ఇది కేవలం టైటిల్స్‌ను గెలిచే టోర్నమెంట్ మాత్రమే కాదని, అమ్మాయిలు క్రికెట్‌ను కెరీర్‌గా కొనసాగించాలనే వారి కలలను నెరవేర్చుకునేందుకు ఒక వేదికగా ఉపయోగపడుతుందని తెలిపాడు. ఇంగ్లండ్ వేదికగా 2017లో జరిగిన ప్రపంచకప్‌లో ఫైనల్‌కు చేరుకొని మహిళల జట్టు జాతీయ దృష్టిని ఆకర్షించింది. అయితే, టీమిండియా వుమెన్స్ జట్టు ఇప్పటి వరకు ప్రపంచకప్‌ను గెలువలేదు. ఈ సారి హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత జట్టు స్వదేశంలో తొలిసారిగా కప్‌ను గెలిచి చరిత్ర సృష్టిస్తుందని.. మహిళల క్రికెట్‌కు దిశానిర్దేశం చేయగలదని టెండూల్కర్ విశ్వాసం వ్యక్తం చేశాడు.

## ఆ టోర్నీ వల్లే ఆసియా కప్‌లో సక్సెస్: కుల్దీప్ యాదవ్


ఆసియా కప్ 2025 టోర్నీలో టీమిండియా విజేతగా నిలవడంలో కుల్దీప్ యాదవ్ కీలక పాత్ర పోషించాడు. 7 మ్యాచ్‌ల్లో 9.29 సగటుతో 17 వికెట్లు పడగొట్టి ఈ టోర్నీ హయ్యెస్ట్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. మిడిల్ ఓవర్లలో ప్రత్యర్థుల పతనాన్ని శాసించాడు. పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్లోనూ(4/30) నాలుగు వికెట్లతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. అయితే ఈ టోర్నీకి ముందు దులీప్ ట్రోఫీ ఆడటం వల్లే ఆసియా కప్ 2025 టోర్నీలో మెరుగ్గా రాణించగలిగానని కుల్దీప్ యాదవ్ చెప్పుకొచ్చాడు. ఇంగ్లండ్ పర్యటనలో ఒక్క మ్యాచ్ ఆడని కుల్దీప్ యదవ్.. దులీప్ ట్రోఫీ ద్వారా రిథమ్ అందుకున్నానని చెప్పాడు. ఫైనల్ అనంతరం రింకూ సింగ్‌తో కలిసి బీసీసీఐ టీవీతో మాట్లాడాడు. 'ఏ బౌలర్‌కు అయినా చాలా కాలంగా క్రికెట్ ఆడనప్పుడు రిథమ్ అందుకోవడం కీలకం. నాకైతే చాలా ముఖ్యం. దాని కోసం నేను దులీప్ ట్రోఫీలో తొలి మ్యాచ్ ఆడాను. అందులో నేను చాలా ఎక్కువగా బౌలింగ్ చేశాను. అందుకే ఈ టోర్నీకి వచ్చేసరికి నా బౌలింగ్ మెరుగైంది. మిడిల్ ఓవర్లలో పరుగులు నియంత్రించడం, వికెట్లు తీయడం నా బాధ్యత. ఈ విషయంలో మా కెప్టెన్‌కు నాపై చాలా నమ్మకం ఉంది. నా బాధ్యతను నేను చాలా బాగా నిర్వర్తించాను. నాకు స్థిరమైన లక్ష్యాలు ఏం లేవు. అవకాశం వచ్చినప్పుడల్లా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడం, జట్టు విజయానికి సహకరించడమే నా పని.'అని కుల్దీప్ యాదవ్ చెప్పుకొచ్చాడు.



ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
బుధవారం 1-10-2025 | www.evarthalu.com



ఆరెస్సెస్ పేరు వినని వారు, తెలియని వారు నేడు ఉండకపోవచ్చు. 1925లో నాగపూర్ లో ప్రారంభమైన ఆరెస్సెస్ 2025 విజయదశమికి వందేళ్లు పూర్తి చేసుకోబోతుంది. శతాబ్ది ఉత్సవాలకు చేరువవుతున్న ఈ శుభ సమయంలో "సంఘ వందేళ్ల నిశ్శబ్ద ప్రయాణం" ఒకసారి గమనిద్దాం. దేశ వికాసం కోసం ఆరెస్సెస్ చేస్తున్న మౌన తపస్సుకి ఆధారం"నిత్యశాఖ". ఈ తంత్రముతో వ్యక్తి నిర్మాణం ద్వారా సాధించిన విజయాలు ఎన్నో, ఎన్నెన్నో. నేడు దేశవ్యాప్తంగా సుమారు 70,000 శాఖలు ఉంటాయి. అంతేకాకుండా దేశంలోని అన్ని జీవన రంగాలలో హిందూ ఆధారిత కార్యం నిర్మాణమై ఉంది. స్వయంసేవకుల వివిధ ప్రయత్నాల ద్వారా సమాజ జీవనంలో వచ్చిన మార్పులను, విజయాలను ఉదాహరణమాత్రంగా కొన్నింటిని పరిశీలిద్దాం.



# ఆరెస్సెస్ చారిత్రక అవసరం

## .................. ఆరెస్సెస్ శత జయంతి సందర్భంగా..

1. "హిందువుగా గర్విస్తాను – హిందువుగా జీవిస్తాను"అనే స్వాభిమాన వాతావరణము నేడు దేశంలో నిర్మాణం అయింది.
2. ప్రతి రోజూ మాతృభూమికి నమస్కరిస్తూ 'భారత్ మాతాకీ జై' అంటూ నేడు వేలాది గ్రామాలలో, పట్టణాలలో, లక్షలాదిమంది పలుకుతున్నారు.
3. సాంస్కృతిక జాతీయత "హిందుత్వం" నేడు దేశంలో ప్రధాన కేంద్ర బిందువుగా మారింది. విశ్వకళ్యాణానికి, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి హిందుత్వమే ఆశాజనకంగా ప్రపంచానికి నేడు కనిపిస్తుంది.
4. హిందూ సమాజం ఆత్మవిశ్వాసము పెంపొందించబడి, సంఘటిత శక్తితో వివిధ సమస్యలను ఎదుర్కొని నిలబడే భయముక్త వాతావరణం సమాజంలో నేడు నిర్మాణం అయింది.
5. సంఘ ప్రారంభంలో మొదలైన "స్వయం సేవకుల ద్వారా పర్వయాత్ర", దేశమంతటా పండగలలో, తిరునాళ్ళలో, పుష్కరాలలో కుంభమేళాలో, వివిధ సందర్భాలలో దేశవ్యాప్తంగా అనేక చోట్ల సేవా రూపంలో నేటికీ కొనసాగుతుంది.
6. స్వాతంత్ర్య సంగ్రామానికి ఆరెస్సెస్ సంపూర్ణ తోడ్పాటును అందించడమే కాకుండా, దేశ విభజన సమయంలో మతోన్మాదుల నుండి హిందువులను సంరక్షించడంలో ప్రధాన భూమిక పోషించింది.
7. స్వాతంత్ర ప్రారంభ రోజులలో జమ్మూ కాశ్మీర్ భారత్ లో విలీనం కావడం మొదలుకొని, నేటి ఆర్టికల్ 370 రద్దు వరకు స్వయంసేవకులు పట్టు వదలకుండా జమ్మూ కాశ్మీర్ రక్షణకు కృషి చేశారు.
8. పాకిస్తాన్ యుద్ధసమయంలో, చైనా దురాక్రమణ సమయంలో ఆరెస్సెస్ సైన్యానికి అండగా నిలిచి, ప్రాణ త్యాగాలకు సైతం వెనుకడుగు వేయకుండా దేశభూభాగాల సంరక్షణలో స్వయంసేవకులు ప్రధాన పాత్ర వహించారు.
9. 1975లో విధించబడిన ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ,ప్రజాస్వామ్య సంరక్షణకు 40 వేలకుపైగా సంఘ స్వయంసేవకులు అజ్ఞాతంగా శ్రమించి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించారు.
10. దేశంలో వరదలు, భూకంపాలు, సునామీ వంటి వివిధ ప్రకృతి విపత్తులు ఏర్పడినప్పుడు ఆరెస్సెస్ చేపట్టిన పునరావాస చర్యలు వివిధ సేవా కార్యక్రమాలు వెలకట్టలేనివి.
11. జాతి చారిత్రక కట్టడాల సంరక్షణలో, జాతి మాన బిందువుల పునర్నిర్మాణం కొరకు సంఘ స్వయం సేవకులు చేసిన ఉద్యమాలు సమాజంలో ఒక సామూహిక శక్తిని నిర్మాణం చేశాయి. ఫలితంగా నేడు "భవ్యరామమందిర నిర్మాణం" మన కళ్ళ ఎదుట నిలబడింది.
12. కులవిభేదాల ప్రస్తావన లేని హిందూ సమాజంలో "సమరసత" కొరకు స్వయంసేవకుల ద్వారా అనేక నిర్మాణాత్మక ప్రయోగాలు నేడు దేశమంతటా నిర్వహించబడుతున్నాయి.
13. జాతీయ జీవనంలో కార్మిక,కర్షక, విద్యార్థి , ఉపాధ్యాయ, ధార్మిక, మేధావి, మహిళ, విద్యా,సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ, చారిత్రక, స్వదేశీ, న్యాయ, సేవ, సహకార, వినియోగ, సైనిక,పత్రిక మొదలైన రంగాలన్నింటిలో సంస్థలు స్థాపించబడి నేడు సంఘపరివార్ గా పిలువబడుతున్నవి. ఇవన్నీ దేశవ్యాప్తంగా జాతీయ భావ జాగృతిని నిర్మాణం చేసి, వ్యవస్థల్లో పరివర్తనకు దోహదపడినవి.
14. నేడు సమాజ పరివర్తనకు ధర్మ జాగరణ, కుటుంబ ప్రబోధన్, సామాజిక సమరసత, గ్రామ వికాసం, గోసేవ, పర్యావరణం వంటి గతి విధులు ప్రారంభమయ్యాయి. దేశవ్యాప్తంగా వివిధ ప్రయోగాలు విజయవంతం అయ్యాయి.
15. శతాబ్ది ఉత్సవాలు వేళ పౌర విధులు, స్వదేశీ, కుటుంబ జీవన విలువలు, సామాజిక సమరసత,పర్యావరణం అంశాలపై ప్రత్యేక దృష్టి నిలిపిన ఆర్ ఎస్ ఎస్ సామాజిక మార్పుకి "పంచ పరివర్తన్" పిలుపునిచ్చింది.

ఆరెస్సెస్ అంటే సమగ్రత, ఆరెస్సెస్ అంటే సమన్వయం. ఆరెస్సెస్ అనేది ఒక చారిత్రక అవసరం. స్వయంసేవక్ ఏ పనినీ వదిలిపెట్టడు. స్వయంసేవక్ ఏ వ్యక్తిని వదిలిపెట్టడు. రండి– దేశ పునర్నిర్మాణ కార్యంలో మీరూ పాలు పంచుకోండి. విశ్వానికి మానవతా విలువలను పంచే మహాయజ్ఞంలో భాగస్వామ్యులం అవుదాం.

**- భారతి,**
**9949394688**





భారతదేశంలో రోడ్డు ప్రమాదాలు ఒక ప్రధాన సమస్యగా మారాయి. ప్రతి సంవత్సరం లక్షలాది మంది మరణాలు, గాయాలతో ఈ సమస్య ఆర్థికంగా, సామాజికంగా భారీ నష్టాన్ని కలిగిస్తుంది. ఈ వ్యాసంలో, రోడ్డు ప్రమాదాల గణాంకాలు, సంబంధిత చట్టాలు, పరిహారాలను వివరిస్తాను. డేటా ముఖ్యంగా 2024-2025 నివేదికల ఆధారంగా ఉంది. ప్రపంచంలోనే అత్యధిక రోడ్డు మరణాలతో భారతదేశం మొదటి స్థానంలో ఉంది. 2024లో మాత్రమే సుమారు 1,80,000 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారు. ఇందులో 30,000 మంది హెల్మెట్ ధరించకుండా బైక్‌పై ప్రయాణించినవారు ఉన్నారు. 2022లో 4,50,000 ప్రమాదాలు జరిగి, 1,50,000 మంది మరణించారు. 2021లో 1,55,622 మరణాలు నమోదయ్యాయి. ఐఐటీ ఢిల్లీ నివేదిక ప్రకారం, భారతదేశంలో రోడ్డు మరణాల రేటు 1990లో ఇతర దేశాలతో పోలిస్తే 40 శాతం ఎక్కువగా ఉండగా, 2021 నాటికి అది 600 శాతానికిచేరింది. ఓవర్‌స్పీడింగ్ (స్పీడ్ ఎక్సెసెస్), మద్యం ప్రభావంలో డ్రైవింగ్, హెల్మెట్/సీట్ బెల్ట్ లేకపోవడం, చెడు రోడ్డు డిజైన్,, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ తదితర కారణాలతోనే ఈ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. తద్వారా జీడీపీలో 3 – 5 శాతం నష్టం వచ్చింది.

# ప్రమాదాలు.. పరిహారాలు

వాస్తవానికి, దేశంలో చట్టాల అమలు బలహీనంగా ఉండటం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయి. అయితే, 2030 నాటికి మరణాలను 50% తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకోసం రోడ్లపై బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి మార్చడం, ట్రాఫిక్ సైన్స్ మెరుగుపరచడం, హైవేలపై ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటుపై దృష్టి సారించింది. వాహనాలకు ఏబీఎస్, ఎయిర్‌బ్యాగ్‌లు తప్పనిసరి చేసింది. హైవేలపై స్పీడ్ గన్స్, సీసీటీవీలను అందుబాటులోకి తెస్తోంది. అన్నింటికన్నా ముఖ్యంగా మోటార్ వెహికల్ అక్సిడెంట్ ఫండ్ అంటే.. 24 గంటల్లో క్యాష్‌లెస్ చికిత్స (రూ.1,50,000 వరకు) అందించనుంది.

రోడ్డు ప్రమాదాల్లో బాధితులు లేదా వారి కుటుంబాలు నష్టపరిహారం పొందే అవకాశం ఉంది. మోటారు వెహికల్స్ యాక్ట్ 1988 (2019లో సవరించబడినది) ప్రకారం.. ప్రమాదానికి కారణమైన వాహనం ఇన్సూరెన్స్ ఉన్నా లేకపోయినా, హిట్–అండ్–రన్ కేసుల్లో కూడా పరిహారం లభిస్తుంది. నష్టపరిహారం మూడు మార్గాల ద్వారా లభిస్తుంది. 1. ఇన్సూరెన్స్ క్లెయిమ్ (మోటార్ అక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్): ప్రమాదానికి కారణమైన వాహనం ఇన్సూరెన్స్ ఉంటే, దాని ద్వారా పరిహారం పొందవచ్చు. ఇది బాధితుడి ఆదాయం, వయసు, గాయాల తీవ్రత ఆధారంగా నిర్ణయించబడుతుంది. 2. నో–ఫాల్ట్ లయబిలిటీ: ప్రమాదానికి ఎవరి తప్పిదమో నిరూపించాల్సిన అవసరం లేకుండా, నిర్దిష్ట మొత్తం పరిహారం లభిస్తుంది. 3. హిట్–అండ్–రన్ కేసులు: వాహనం గుర్తించబడకపోతే, ప్రత్యేక పథకం ద్వారా పరిహారం.

గోల్డెన్ అవర్ పథకం: ప్రమాదం తర్వాత మొదటి గంటలో చికిత్సకు నగదు రహితంగా రూ.1.5 లక్షల వరకు సహాయం (7 రోజుల వరకు). ఇది జాతీయ ఆరోగ్య మిషన్ అందిస్తుంది.

పరిహారానికి కావాల్సినవి:

ప్రమాదం తర్వాత స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ (ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్) దాఖలు చేయాలి. హిట్–అండ్–రన్ కేసులో పోలీసులు బాధితులకు పథకం గురించి తెలియజేయాల్సిన బాధ్యత ఉంది. ప్రమాదం జరిగిన జిల్లా మోటార్ అక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌లో అప్లికేషన్ సమర్పించాలి ప్రమాదం తర్వాత 6 నెలల వరకు అవకాశం ఉంటుంది. హిట్ అండ్ రన్ కేసుల్లో జిల్లా క్లెయిమ్స్ సెటిల్మెంట్ కమిషనర్‌కు అప్లై చేయాలి. ఈ ప్రక్రియ 6 నెలల్లో పూర్తవుతుంది.

**అవసరమైన డాక్యుమెంట్లు**

1. ఎఫ్ఐఆర్ కాపీ
2. మెడికల్ రిపోర్టులు/పోస్ట్‌మార్టమ్ రిపోర్టు
3. ఆధార్/ఐడీ ప్రూఫ్, ఆదాయ సర్టిఫికెట్ (ఉంటే)
4. కుటుంబ సంబంధాలు చూపే డాక్యుమెంట్లు (మరణం సంభవించే సందర్భాల్లో)

**- పీ జయపాల్,**
**బీఎస్సీ, ఎంఏ, ఎల్ఎల్బీ**
**ఫోన్ నంబర్:**
**9490235704**

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.